జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడుము.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | శుక్రవారం 16 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 247 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


# రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు



- 19 ప్రాజెక్టులు.. రూ. 33 వేల కోట్ల పెట్టుబడులు
- నూతన పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి
- ఎస్.ఐ.పి.బి సమావేశంలో సీఎం చంద్రబాబు
- టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, రూముల కొరత ఉంది
- పెద్దఎత్తున హొటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది
- 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యం.

**అమరావతి**

రాష్ట్రంలో కొత్తగా 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 33 వేల కోట్ల పెట్టుబడులకు ఎస్.ఐ.పి.బి సమావేశంలో ఆమోదం తెలిపినట్లు సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలి. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలి. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్ర స్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలి. ఎస్ఐపిబి సమావేశాల్లో - మిగతా3లో



## 'వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే భయం

- రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకురాకపోగా, ఉన్న పరిశ్రమలపై కుట్రలు
- ఏడాది కూటమి పాలన రాష్ట్ర ప్రజలకు చీకటి రోజులనే మిగిల్చింది
- ఈ ఏడాది పాటు చంద్రబాబు పాలనను చూస్తే బాధ కలుగుతోంది
- ఎన్నికలకు ముందు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు.



## పీఓకేను అప్పగించకుంటే మరిన్ని యుద్ధాలు

- కేంద్రమంత్రి రాందాస్ అథవాలే
- పీవోకేను భారత్‌లో విలీనం చేయాలని
- ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం పాక్‌కు గుణపాఠం చెప్పిందని ప్రశంస
- వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి
- కాశ్మీర్ అంశంలో మూడో వ్యక్తి జోక్యం అనవసరమని స్పష్టీకరణ



## నిద్రపోనివ్వకుండా రహస్యాలు అడిగి: పాక్ చెరలో బీఎస్ఎఫ్ జవాన్‌కు వేధింపులు

- కస్టడీలో ఉండగా బీఎస్ఎఫ్ జవాన్‌ను పాక్ అధికారులు దూషించి, వేధించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడి
- వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం

## కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో అందరికీ తెలుసు



- భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్
- భారత్ కేవలం పీవోకే, టెర్రరిజం గురించి మాత్రమే మాట్లాడుతోంది
- సింధూ జలాల నిలిపివేతపై యథాతథ స్థితి కొనసాగుతోంది
- ఉగ్రవాదులకు మౌలిక వసతులు కల్పించే వ్యవస్థను రుపుమాపాలి"

## భూసర్వేతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం




- భూమి అంటే మన దేశంలో గౌరవం, సెంటిమెంట్
- భూ వివాదాలు ఏళ్ల తరబడి కోర్టుల్లో పెండింగ్‌లో ఉంటున్నాయి
- "సుమారు వంద సంవత్సరాల తర్వాత జరుగుతున్న భూముల సర్వే కాబట్టి జాగ్రత్తగా చేయాలి
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు**

భూమి అంటే మన దేశంలో గౌరవం, సెంటిమెంట్ అని.. ఆర్థిక భరోసా ఇస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని ఐటీసీ హోటల్‌లో 'భూముల రీసర్వే-భూ రికార్డుల డిజిటలైజేషన్'పై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయన కార్యశాల ప్రారంభించి మాట్లాడారు. భూ వివాదాలు ఏళ్ల తరబడి కోర్టుల్లో పెండింగ్‌లో ఉంటున్నాయని.. దీని వల్ల యజమానులు చాలా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అమెరికాలో ప్రజల ఇళ్లు, భూమి వద్దకే అధికారులు వచ్చి రిజిస్ట్రేషన్ చేసి వెళ్తారని వివరించారు. "సుమారు వంద సంవత్సరాల తర్వాత జరుగుతున్న భూముల సర్వే కాబట్టి జాగ్రత్తగా చేయాలి. సిబ్బంది కొరత, నిధులు సమస్య అధిగమించటంపై దృష్టి సారించాం. నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచిస్తున్నాం. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. - మిగతా3లో

## టర్కీకి జామియా మిలియా ఇస్లామియా షాక్

- ఆ సంస్థలతో ఒప్పందాల నిలిపివేత
- టర్కీ విద్యా సంస్థలతో ఒప్పందాలు నిలిపివేసిన జామియా మిలియా ఇస్లామియా
- జేఎన్‌యూ బాటలోనే టర్కీపై చర్యలు తీసుకున్న విశ్వవిద్యాలయం
- 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్‌కు టర్కీ మద్దతే అందుకు కారణం
- దేశవ్యాప్తంగా 'బాయ్‌కాట్ టర్కీ' ప్రచారం... టర్కీ నుంచి దిగుమతుల నిలిపివేత





## దేశ ప్రధానిని పొగిడితే తప్పేంటి?

- కాంగ్రెస్ లోక్ సభ ఎంపీ శశిథరూర్
- నేను ఒక భారతీయుడిగా మాత్రమే ప్రధాని మోదీని పొగిడాను

## మహిళల్లో అహల్య భాయి ధైర్యాన్ని నింపారు



- బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి
- మహిళల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం అహల్య భాయి హెూల్కర్ చట్టసవరణలు చేశారు
- భర్త ఆస్తిలో.. ఆ భార్యకు హక్కు ఉంటుందని చట్టసవరణ చేసి మార్పులు తీసుకువచ్చారు

**విజయవాడ**

ఆర్థిక శక్తిగా భారతదేశాన్ని తీసుకెళ్లాలంటే మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవాలని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అలాంటి ఆలోచనలు ఆనాడు అహల్య భాయి హెూల్కర్ ఆలోచించి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేశారని చెప్పారు. పరిశ్రమలకు పెట్టుబడులు రావాలంటే ఇలాంటి - మిగతా3లో



## రాష్ట్రపతికి సుప్రీంకోర్టు డెడ్‌లైన్ ఏంటి?

- సంచలనంగా ద్రౌపది ముర్ము ప్రశ్నలు!
- రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు నిర్దేశిస్తాయా?.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలేంటి?.
- రాజ్యాంగంలోని 361వ అధికరణం, 200వ అధికరణం కింద గవర్నర్ చర్యలకు సంబంధించి న్యాయ సమీక్షపై పూర్తి నిషేధం విధిస్తుందా?

# నిద్రపోనివ్వకుండా రహస్యాలు అడిగి: పాక్ చెరలో బీఎస్ఎఫ్ జవాన్‌కు వేధింపులు



**ఇంటర్నెట్‌డెస్క్:** పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు. ఇక ఈ ప్రశ్నలన్నీ అడిగిన అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నారట.

పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీంతో పాకిస్థాన్ పైనా ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదల చేసింది. బీఎస్ఎఫ్ కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది.

# కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో అందరికీ తెలుసు



**ఢిల్లీ:** పాక్ ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాల్సిందేనని భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో అందరికీ తెలుసునంటూ ఆయన వ్యాఖ్యానించారు. భారత్ కేవలం పీవోకే, టెర్రరిజం గురించి మాత్రమే మాట్లాడుతోంది. సింధూ జలాల నిలిపివేతపై యథాతథ స్థితి కొనసాగుతోంది. ఉగ్రవాదులకు మౌలిక వసతులు కల్పించే వ్యవస్థను రుపుమాపాలి" అని జైశంకర్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో చర్చలు ఉగ్రవాదంపై మాత్రమే ఉంటాయని ప్రధాని చాలా స్పష్టంగా చెప్పారని జైశంకర్ గుర్తు చేశారు. ఉగ్రవాదంపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని జైశంకర్ చెప్పారు. కాగా, ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్‌తో తాజా ఉద్రిక్తతలు, నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో మంత్రులు, సీనియర్ ఉన్నతాధికారుల భద్రతపై కేంద్రం నిశితంగా దృష్టి పెట్టింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. మంత్రి కాన్వాయ్‌లో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను చేరుస్తూ కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలోని ఆయన నివాసం చుట్టూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. జైశంకర్‌కు భద్రతను 2023లో వై నుంచి జెడ్ కేటగిరీకి పెంచారు. ఇప్పటికే రెండో అత్యున్నత స్థాయి భద్రత. అందులో భాగంగా 33 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ కమాండోల బృందం 24 గంటలూ ఆయనను కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటుంది. జెడ్ కేటగిరీలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), 4 నుండి ఆరుగురు స్థానిక పోలీసు మంది కమాండోలతో సహా 22 మంది సిబ్బంది, ఒక బుల్లెట్ ప్రూఫ్ వాహనం, ఎస్కార్ట్ వాహనాలుంటాయి. సాధారణంగా ఉన్నత స్థాయి రాజకీయ నాయకులకు, ప్రముఖులకు, బెదిరింపులను ఎదుర్కొంటున్న వారికి ఈ స్థాయి భద్రత అందిస్తారు. కేంద్ర రక్షణ జాబితాలోని వీఐపీ భద్రతా కవర్ జెడ్%-%ప్లస్ (అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్), జెడ్, వై, వై%-%ప్లస్, ఎక్స్ దాకా ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో సహా దాదాపు 200 మందికి సీఆర్‌పీఎఫ్ వీఐపీ భద్రతా సంరక్షణ ఉంది.

# రాష్ట్రపతికి సుప్రీంకోర్టు డెడ్‌లైన్ ఏంటి?



**ఢిల్లీ:** ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా ఖండించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో, రాష్ట్ర బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై తాజాగా ద్రౌపదీ ముర్ము స్పందించారు. ఈ క్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు పశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు సమాచారం. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

అలాగే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 గవర్నర్ అధికారాలను, బిల్లులకు ఆమోదం తెలపడం లేదా నిలిపివేయడం, రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును రిజర్వ్ చేయడం వంటి విధానాలను వివరిస్తుందని రాష్ట్రపతి హైలైట్ చేశారు. అయితే, ఈ రాజ్యాంగ ఎంపికలను ఉపయోగించుకోవడానికి గవర్నర్‌కు ఎలాంటి గడువును ఆర్టికల్ 200లో పేర్కొనలేదని అన్నారు.

**సుప్రీంకోర్టును అడిగిన ప్రశ్నలివే..**

రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు నిర్దేశిస్తాయా?.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలేంటి?.

రాజ్యాంగంలోని 361వ అధికరణం, 200వ అధికరణం కింద గవర్నర్ చర్యలకు సంబంధించి న్యాయ సమీక్షపై పూర్తి నిషేధం విధిస్తుందా?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి రాజ్యాంగ విచక్షణ వినియోగం న్యాయ సమ్మతమైనదా?

రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు?.

సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా?.

ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా?.రాజ్యాంగంలో రాష్ట్రపతి అధికారాల మేరకు ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు సలహాను పొందడానికి లేదా గవర్నర్, రాష్ట్రపతి అనుమతి కోసం బిల్లును రిజర్వ్ చేయడం లేదా ఇతర విధంగా సుప్రీంకోర్టు అభిప్రాయం పొందడం అవసరమా? అని ప్రశ్నించారు.

# పాక్ దగ్గర ఉన్న అణుబాంబులను లాక్కోండి.. రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి



**జమ్మూకాశ్మీర్:** ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన తర్వాత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మొదటిసారి జమ్మూకాశ్మీర్‌కు వెళ్లారు. గురువారం అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఆర్మీకి సంబంధించిన 15 కార్ప్స్ హెడ్ క్వాటర్స్‌కు కూడా ఆయన వెళ్లారు. అక్కడ ఆర్మీ జవాన్లతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటంపై కేంద్రమంత్రి మాట్లాడారు. బాధ్యత లేని.. మూర?మైన పాకిస్థాన్ లాంటి దేశం దగ్గర అణుబాంబులు ఉండటం మంచిది కాదని ఆయన అన్నారు. పాక్ దగ్గర ఉన్న అన్ని అణుబాంబులను ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. 'ఉగ్రవాదానికి.. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన జవాన్లకు శిరస్సు వంచి వందనం చేస్తున్నా. వారికి నివాళులు అర్పిస్తున్నా. గాయపడ్డ జవాన్లకు సెల్యూట్ చేస్తున్నా. వారు త్వరగా కోలుకోవాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమయాకమైన పౌరులకూ నివాళులు అర్పిస్తున్నా. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేసిన అతి పెద్ద ఆపరేషన్. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ఎంతవరకైనా వెళ్తాం. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడాన్ని పాకిస్థాన్ ఇకనైనా ఆపాలి. ఉగ్రవాదులే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ దాడులు చేసిందని ప్రపంచం మొత్తానికి తెలుసు. ఈ రోజుకూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగానే పోరాటం చేస్తున్నాం. అణు బాంబు బెదిరింపులకు సైతం భయపడలేదు. పాకిస్థాన్ ఎంత చెత్తగా ఇండియాను బెదిరించిందో ప్రపంచం మొత్తం చూసింది. శ్రీనగర్ గడ్డమీద నుంచి ఓ ప్రశ్న లేవనెత్తుతున్నా. బాధ్యత లేని.. మూర?మైన దేశం చేతిలో అణుబాంబులు ఉండటం ఎంత వరకు మంచిది. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ ఆ బాంబులను స్వాధీనం చేసుకోవాలని' అన్నారు.

## దేశ ప్రధానిని పొగిడితే తప్పేంటి?



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత ప్రభుత్వం.. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు ముచ్చెమటలు పట్టించగా, దానిని కాంగ్రెస్ లోక్ సభ ఎంపీ శశిథరూర్ కొనియాడారు. ప్రత్యేకంగా ఇక్కడ ప్రధాని నరేంద్ర మోదీపై పొగడ్తల వర్షం కురిపించారు. దేశాన్ని మోదీ నడిపిస్తున్న తీరు అమోఘమంటూ కొనియాడారు. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. శశిథరూర్ 'లక్ష్మణ రేఖ' దాటారంటూ విమర్శించింది. దీనిపై శశిథరూర్ తీవ్రంగా స్పందించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ' ఇక్కడ భారత్, పాకిస్తాన్ ల మధ్య జరిగిన యుద్ధాన్ని ప్రత్యేక కోణంలో చూడాలి. నేను ఒక భారతీయుడిగా మాత్రమే ప్రధాని మోదీని పొగిడాను. ఇది నాకు చాలా గర్వంగా కూడా ఉంది. ఇది నా వ్యక్తిగతమైన అభిప్రాయం మాత్రమే. దీనికి పార్టీ నిర్ణయంతో పనేంటి?' అంటూ ధ్వజమెత్తారు. 'భారత్, పాకిస్తాన్ ల యుద్ధంపై నన్ను కొంతమంది అడిగారు. దీన్ని మీరు ఎలా చూస్తారు అని ప్రశ్నించారు. దీనిపై నాకు అవగాహన ఉంది కాబట్టి మాట్లాడా. ఇక్కడ నేను మాట్లాడింది అంతా క్లియర్ గానే ఉంది. ఒక భారతీయుడిగా నా వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తం చేశాను. ఇక్కడ ప్రధాని మోదీని పొగిడితే పార్టీ అభిప్రాయం ఎలా అవుతుంది' అని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు శశిథరూర్. కాగా, ఆపరేషన్ సిందూర్ లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న కార్యక్రమాలపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పొగడ్తల వర్షం కురిపించారు. రెండు రోజుల క్రితం శశిథరూర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని నడిపిస్తున్న తీరు అఘోఘమంటూ వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ తో దాయాది పాకిస్తాన్ కు ఒక క్లియర్ మెస్సేజ్ పంపించారని అన్నారు. ఇక్కడ పాకిస్తాన్ ఏదో సాధించినట్లు చెప్పుకుంటున్న దానిని అస్సలు పట్టించుకోవాల్సి అవసరం లేదన్నారు. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ ఏం జరిగిందో అంతా చూశారన్నారు శశిథరూర్. భారత్, పాకిస్తాన్ ల మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్తతను సమర్థవంతంగా తిప్పికొట్టారని, ఇందులో తమకు ఎటువంటి సందేహం లేదన్నారు శశిథరూర్. ఇక కోవిడ్ సమయంలో కూడా ప్రధాని మోదీ స్పందించిన తీరును ఈ సందర్భంగా శశిథరూర్ ప్రస్తావించారు.

## పీఓకేను అప్పగించకుంటే మరిన్ని యుద్ధాలు



పీఓకే అంశంపై కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాలే కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకేను భారత్‌లో విలీనం చేయాల్సిందేనని, ఒకవేళ పాకిస్థాన్ అందుకు అంగీకరించని పక్షంలో దానిని స్వాధీనం చేసుకునేందుకు మరిన్ని యుద్ధాలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ను ప్రశంసించిన అథవాలే, ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఆర్మీకి తగిన రీతిలో బుద్ధి చెప్పిందని అన్నారు. "పాకిస్థాన్ ను భారత్ గట్టిగా దెబ్బతీసింది. కాల్పుల విరమణ అనేది కొన్ని రోజులు మాత్రమే ఉంటుంది. మన సైన్యం దాయాది దేశానికి సరైన గుణపాఠం నేర్పింది. పాకిస్థాన్‌లో తలదాచుకున్న వంద మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఈ ఆపరేషన్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వంతో ముగించలేదు. పీవోకేను భారత్‌కు అప్పగించాలని, ఉగ్రవాద కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని పాకిస్థాన్ ముందు భారత్ స్పష్టమైన ప్రతిపాదనలు ఉంచింది" అని వివరించారు. కశ్మీర్ వివాదంలో మూడో వ్యక్తి ప్రమేయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని అథవాలే తేల్చిచెప్పారు. "తూటాకు తూటాతోనే సమాధానం చెప్పడమనేది భారత విధానం. పీవోకే భారత్‌లో అంతర్భాగమని గతంలో పార్లమెంటు వేదికగా కూడా నేను స్పష్టం చేశాను. ఒకవేళ పాకిస్థాన్ దానిని అప్పగించకపోతే, దాన్ని తిరిగి మన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి మరిన్ని యుద్ధాలు చేయాల్సి ఉంటుంది" అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుత సున్నితమైన పరిస్థితులను విపక్షాలు రాజకీయం చేయవద్దని కూడా అథవాలే హితవు పలికారు.

## టర్కీకి జామియా మిలియా ఇస్లామియా షాక్

పాకిస్థాన్‌కు టర్కీ బాహాటంగా మద్దతు తెలుపుతున్న నేపథ్యంలో భారత్?లో వ్యతిరేకత కొనసాగుతోంది. ఈ క్రమంలో ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జామియా మిలియా ఇస్లామియా (జేఎంఐ) విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. టర్కీలోని వివిధ విద్యా సంస్థలతో గతంలో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలను (ఎంఓయూ) నిలిపివేస్తున్నట్లు జేఎంఐ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ సైమా సయీద్ జాతీయ మీడియాకు తెలియజేశారు. కొంతకాలం క్రితం, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో టర్కీ పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు పలికింది. ఈ చర్యపై భారతదేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో ఢిల్లీలోని జేఎన్‌యూ టర్కీలోని ఇనొను యూనివర్సిటీతో కుదిరిన విద్యా ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఇప్పుడు జేఎన్‌యూ బాటలోనే జామియా మిలియా ఇస్లామియా కూడా పయనించింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో టర్కీ తన సైనిక విమానాలను, ఒక యుద్ధనౌకను పాకిస్థాన్‌కు పంపించిందని పెద్ద మొత్తంలో డ్రోన్లను కూడా సరఫరా చేసిందని వార్తలు వెలువడ్డాయి. ఈ ఆయుధాలను పాకిస్థాన్ భారత్‌పై ప్రయోగించినట్లు ఆధారాలు లభించాయి. భూకంపం సంభవించినప్పుడు మానవతా దృక్పథంతో భారత్ అందించిన సహాయాన్ని టర్కీ విస్మరించి పాకిస్థాన్‌కు మద్దతు పలకడం పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమైంది.

## అందుకే కులగణనకు ప్రధాని మోదీ అంగీకారం

**దర్భంగా:** దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. " ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ గేటు బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను. బిహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోదీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోదీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసు" అని రాహుల్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కాకుండా...అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు.

# రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

-మొదటిపేజీ తరువాయి

కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు... ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రెస్ వివరించాలి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, రూముల కొరత ఉంది. పెద్దఎత్తున హొటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యం. హొటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్దం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా దేవాలయాలకు వచ్చే వారికి మంచి వసతి అనేది చాలా ముఖ్యం. కుటుంబాలతో వచ్చే వారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతారవణంలో ఉండాలి అనుకుంటారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. అదే విధంగా గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామికరంగంపై మాట్లాడుతూ... 'వ్యవసాయ వ్యర్థాలను కొన్ని చోట్ల తగలబెడుతున్నారు... దీన్ని నివారించాల్సి ఉంది. చిన్నచిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్ట్‌ను సర్క్యులర్ ఎకానమీగా మార్చాలి. అగ్రికల్చర్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి' అని సిఎం సూచించారు. 6వ ఎస్ఐపీబీ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 19 సంస్థలకు సంబంధించి రూ. 33,720 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 34,621 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.



**ప్రాజెక్టులు ఇలా..**

ఐ అండ్ సి డిపార్ట్‌మెంట్ లో డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : కుమరవరం, అనకాపల్లి జిల్లా – రూ.1,560 కోట్ల పెట్టుబడులు, 1,800 ఉద్యోగాలు.

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ : పాలసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా – రూ.1,400 కోట్ల పెట్టుబడులు, 800 ఉద్యోగాలు, పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : ఓర్వకల్, కర్నూలు జిల్లా – రూ.1,286 కోట్ల పెట్టుబడులు, 1,200 ఉద్యోగాలు, బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా – రూ.2,300 కోట్ల పెట్టుబడులు, 1,750 ఉద్యోగాలు, జుపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా – రూ.2,700 కోట్ల పెట్టుబడులు, 2,216 ఉద్యోగాలు

**టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్..**

రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ : తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా – రూ.228 కోట్ల పెట్టుబడులు, 250 ఉద్యోగాలు, మోహన్ స్పింటెక్స్ : మాలవల్లి, కృష్ణా జిల్లా – రూ.482 కోట్ల పెట్టుబడులు, 1,525 ఉద్యోగాలు, ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ : అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా – రూ.1,779 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు.

ఏపీఐఐసీ డిపార్ట్‌మెంట్.. వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి జిల్లా – రూ.1,061 కోట్ల పెట్టుబడులు, 10,098 ఉద్యోగాలు, అలీప్ కుప్పం : చిత్తూరు జిల్లా – రూ.5 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలు.

**ఎనర్జీ డిపార్ట్‌మెంట్..**

నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : ఏలూరు జిల్లా – రూ.150 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు, దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు – రూ.2,920 కోట్ల పెట్టుబడులు, 230 ఉద్యోగాలు, ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : కడప జిల్లా – రూ.3,941 కోట్ల పెట్టుబడులు, 260 ఉద్యోగాలు, బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు – రూ.9,000 కోట్ల పెట్టుబడులు, 3,900 ఉద్యోగాలు.

**టూరిజం డిపార్ట్‌మెంట్..**

బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్ పి: తిరుపతి – రూ.150 కోట్ల పెట్టుబడులు, 350 ఉద్యోగాలు, స్రవంతి హొటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి – రూ.327 కోట్ల పెట్టుబడులు, 570 ఉద్యోగాలు, వరుణ్ హాస్పటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ : విశాఖపట్నం – రూ.899 కోట్ల పెట్టుబడులు, 1,300 ఉద్యోగాలు.

ఐటీ డిపార్ట్‌మెంట్..

డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ, తిరుపతి జిల్లా – రూ.2,475 కోట్ల పెట్టుబడులు, 5,150 ఉద్యోగాలు, సెన్సోరెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : కర్నూలు జిల్లా – రూ.1,057 కోట్ల పెట్టుబడులు, 622 ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు.

# 'వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే భయం

గుంటూరు: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రం తిరోగమనంలో సాగుతోందిన మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకురాకపోగా, ఉన్న పరిశ్రమలపై కుట్రలు చేస్తూ, వారిని రాష్ట్రం వదిలి పారిపోయేట్లుగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న సజ్జన్ జిందాల్, నేడు వికాట్ ఫైనాన్స్ సెక్రటరీ గోవిందప్ప బాలాజీ వరకు ఈ వేధింపులు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. ఏడాది కూటమి పాలన రాష్ట్ర ప్రజలకు చీకటి రోజులనే మిగిల్చిందని అన్నారు. ఇంకా ఆయనేమన్నారంటే... గత వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక విధానాలు, ప్రజల కొనుగోలుశక్తి, రెవెన్యూ ఆదాయం, మూలధన పెట్టుబడి అంశాల్లో గణనీయమైన ప్రగతిని సాధించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావోస్తోంది. ఈ ఏడాది పాటు చంద్రబాబు పాలనను చూస్తే బాధ కలుగుతోంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. సంపదను సృష్టించి, ప్రజల ఆదాయాలను పెంచడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చేస్తానంటూ నమ్మించారు. కానీ ఆయన పాలనను చూస్తే దయనీయమంగా కనిపిస్తోంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్ జగన్‌పై ఏ విధంగా బురదచల్లాలి, ఏ విధంగా ఆయన వ్యక్తిత్వహననం చేయాలి, వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు ఎలా బనాయించాలి, పోలీసులను ప్రయోగించి ఎలా వేధించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారు. చంద్రబాబు తన మొత్తం సమయాన్ని రెడ్ బుక్ రాజ్యాంగం అమలు కోసమే వినియోగిస్తున్నారే తప్ప రాష్ట్రం గురించి, ప్రజల బాగోగుల గురించి కాదు.

**వికాట్ ఫైనాన్స్ సెక్రటరీ గోవిందప్ప బాలాజీపై తప్పుడు కేసులు**

లేని మద్యం కేసును రంగంలోకి తీసుకువచ్చి, దానిలో వైఎస్ జగన్‌కి సన్నిహితులైన వారందరినీ బాధ్యులుగా చూపి, ఒక పథకం ప్రకారం కక్ష సాధింపులకు చంద్రబాబు తెగబడ్డారు. దీనిలో భాగంగానే అంతర్జాతీయ సంస్థ వికాట్‌లో ఫైనాన్స్ సెక్రటరీగా పనిచేస్తున్న గోవిందప్ప బాలాజీని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. వికాట్ అనే సంస్థ 165 సంవత్సరాల కిందట ప్రారంభించిన సిమెంట్ కంపెనీ. యూరప్‌లోనే పేరు ప్రఖ్యాతలు సాధించిన ఈ సంస్థ 1967లో ప్రారంభమైంది. ఈ సంస్థ 2024లో మొత్తం 44,316 కోట్ల రూపాయలు సిమెంట్ అమ్మకాల ద్వారా ఆర్జించిందంటే ఎంత బలమైన సంస్థో అర్థం చేసుకోవచ్చు. వైఎస్ జగన్ భారతీ సిమెంట్స్‌ను వరల్డ్ ఫస్ట్‌క్లాస్ టెక్నాలజీతో ప్రారంభించారు. దానిని 2010లో ఈ వికాట్ కంపెనీ టేకోవర్ చేసింది. 51 శాతం వాటాలు దీనికి ఉన్నాయి. ఈ వికాట్ కంపెనీనికి బాలాజీ గోవిందప్ప ఫుల్‌టైం ఫైనాన్స్ సెక్రటరీ. కేవలం వైఎస్ జగన్ ప్రారంభించిన కంపెనీలో ఈయన పనిచేస్తున్నారనే కారణంతోనే లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి, దానిలో ఆయనను ఇరికించి, ఆయనను జైలుకు పంపారు. చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలకు ఈ అరెస్ట్ ఒక ఉదాహరణ. అలాగే సజ్జన్ జిందాల్ భారతదేశంలోనే పెద్ద వ్యాపార దిగ్గజం. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభించి, పనులు ప్రారంభించారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఒక సెకెండ్ గ్రేడ్ సినిమా ఆర్టీస్ట్‌ను అడ్డం పెట్టుకుని జిందాల్‌ను వేధింపులకు గురి చేశారు. ఇవి తట్టుకోలేక జిందాల్ కడప నుంచి వెళ్ళి మహారాష్ట్రలో మూడు లక్షల కోట్ల




రూపాయల పెట్టుబడులు పెట్టారు. అలాగే ఈ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులపై కేసులు పెట్టారు. ఒక డీజీపీ ర్యాంక్‌లో ఉన్న పోలీస్ అధికారిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఇలా వైఎస్ జగన్‌పై కోపంతో, మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందనే భయంతో పారిశ్రామి కవేత్తలను చంద్రబాబు భయపెట్టాలని చూస్తున్నారు.

**కూటమి నేతల అరాచకాలతో పారిశ్రామికవేత్తలు బెంబేలు**

మరోవైపు కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు పారిశ్రామికవేత్తలపై మామూళ్ల కోసం దాడులు చేస్తున్నారు. తాడిపత్రిలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ పై బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఫిర్యాదులు చేశారు. తనకు రౌడీ మామూళ్ళు ఇవ్వడం లేదని కంపెనీకి ముడిసరుకుని ట్రాన్స్‌పోర్ట్ చేసే సంస్థలను ఇబ్బంది పెట్టారు. దీనితో సిమెంట్ ప్లాంట్‌నే మూసేసే పరిస్థితి వచ్చింది. ఒకవైపు ప్రధానమంత్రి మన దేశంలోనే మేకిన్ ఇండియాలో భాగంగా అన్నీ ఉత్పత్తి చేసుకోవాలని చెబుతుంటే, అదే బీజేపీకి చెందిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తనకు రౌడీ మామూళ్ళు ఇవ్వడం లేదని ఏకంగా అల్ట్రాటెక్ సిమెంట్ ప్లాంట్‌నే మూయించే ప్రయత్నం చేశారు. ఇలా చేస్తుంటే పరిశ్రమలు వస్తాయా? గండికోట ప్రాంతంలో ఆదానీ హైడ్రోపవర్ పైనా బీజేపీ ఎమ్మెల్యే, ఆయన సోదరుడు తమకే మొత్తం కాంట్రాక్ట్‌లు ఇవ్వాలని ఆ కంపెనీ కార్యాలయంపైనే దాడి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఏపీలో ఏ పరిశ్రమ అయినా సరే కూటమి ఎమ్మెల్యేలకు కప్పం కట్టాల్సిందే, లేనిపక్షంలో ఆ సంస్థలు పనిచేయవు అనే విధంగా వ్యవహరిస్తున్నారు. పల్నాడులోని గురజాడలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తాను ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేశానని, ఆ డబ్బును భవ్య, చెట్టినాడు సిమెంట్ ప్లాంట్లు చెల్లించాలంటూ వారిని వేధించడంతో ఈ రెండు సిమెంట్ కంపెనీలు మూతపడ్డాయి. శ్రీకాకుళంలోని యూబీ బీర్ తయారీ ఫ్యాక్టరీపై నడికుదిటి ఈశ్వర్‌రావు అనే బీజేపీ ఎమ్మెల్యే బీర్ రవాణా చేసే ఒక్కో లారీకి వెయ్యి రూపాయలు ఇవ్వాలని బెదిరించాడు. ఈ లెక్కన నెలకు రూ.1.50 కోట్లు వారి నుంచి డిమాండ్ చేశాడు. పదివేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న యూబీ సంస్థపై ఇలాంటి వేధింపులకు పాల్పడటంతో ఆ సంస్థ ఎలా ఈ రాష్ట్రంలో కొనసాగుతుంది? జాతీయ రహదారుల కాంట్రాక్ట్‌ల కోసం బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌లు పోటీపడి కొట్టుకునే పరిస్థితికి వచ్చారు. దాల్మియా సిమెంట్‌పై చంద్రబాబు కక్షసాధింపు ప్రారంభించారు. ఇప్పటి వరకు రూ.793 కోట్ల రూపాయలు జప్తు చేసే కార్యక్రమం చేశారు. టీవీ9 ను లొంగతీసుకోవాలని మైహోం రామేశ్వరరావుకు చెందిన సిమెంట్ కంపెనీకి గనుల నుంచి ముడిసరుకుని రానివ్వకుండా వేధిస్తున్నారు.

**అసమర్థ పాలనతో ప్రగతి శూన్యం**

చంద్రబాబు అద్భుతమైన సంపద సృష్టిస్తాను, పరిశ్రమలను తీసుకువస్తాను అని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. ఐదేళ్ల పాటు మంచి పాలనను అందించిన వైఎస్ జగన్ కాదని ఒక దుర్మార్గమైన పాలనను అనుభవిస్తున్నామని నేడు అన్ని వర్గాలు ఆవేదన చెందుతున్నారు. కాగ్ లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రం తిరోగమనంలో ఉందని తెలుస్తుంది. 2023-24లో వచ్చిన ఆదాయం కంటే 2024-25లో వచ్చిన ఆదాయంలో తగ్గుదల రూ.5520 కోట్లు. ఇదేనా చంద్రబాబు సంపద సృష్టించడం? ఆయన సంపద పోగొడుతున్నాడు. అమ్మకంపన్ను, స్టాంప్ డ్యూటీ చూస్తే 2024-25లో అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రూ.1,053 కోట్లు పడిపోయింది. రిజిస్ట్రేషన్లు లేవు, అమ్మకాలు లేవు, ప్రజల కొనుగోలు శక్తి సన్నగిల్లింది. ఇదీ అనుభవజ్ఞుడైన చంద్రబాబు పాలన. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయం అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రూ.705 కోట్లకు పడిపోయింది. ఇక పన్నేతర ఆదాయానికి వస్తే 2024-25లో రూ.842 కోట్లు తగ్గింది. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రావాల్సిన డబ్బు 2024-25లో రూ.14,563 కోట్లు తగ్గింది. మూలధన వ్యయం రూ.4,413 కోట్లకు తగ్గిపోయింది. విద్యా, వైద్యం, సంక్షేమం తదితరాలకు చేసిన వ్యయం రూ.4696 కోట్లు తగ్గింది. కాగ్ రిపోర్ట్ ప్రకారం వచ్చిన లెక్కలు ఇవి.

**హామీల అమలులో పూర్తి వైఫల్యం**

చంద్రబాబు ఎల్లోమీడియాను అడ్డం పెట్టుకుని గొప్పగా తమను తాము ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు ఏదీ? ఈ హామీలను అమలు చేయడానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏడాదికి రూ.79,867 కోట్లు అవసరం. కానీ చంద్రబాబు బడ్జెట్‌లో కేటాయించింది చూస్తే రూ.7,282 మాత్రమే. దీనిలో ఖర్చు పెట్టింది రూ.865 కోట్లు మాత్రమే. చివరికి పెన్షన్లలోనూ మూడు లక్షల వరకు కోత పెట్టారు. ఉచిత బస్సు ఊసే లేదు. చివరికి తల్లికి వందనం కింద ఇచ్చేదానిని కూడా వాయిదాల ప్రకారం ఇస్తానంటున్నారు. గతంలో ఇలాగే రైతురుణమాఫీని కూడా ఎగ్గొట్టారు. ఇప్పుడు తల్లికి వందనంను కూడా ఇలాగే చేస్తున్నారు. ఇక నిరుద్యోగభృతి అమలు ఏమయ్యిందో తెలియదు. పాలన ద్వారా ప్రజలను మెప్పించి, మళ్ళీ అధికారంలోకి రావాలనే కోరికే చంద్రబాబుకు లేదు. చంద్రబాబ అసమర్థ పాలనతో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి, జీఎస్టీ వసూళ్ళు తగ్గిపోయాయి. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను తీవ్రంగా భ్రష్టు పట్టించారు. పోలీసులను రాజకీయ కక్ష సాధింపులకు వాడుకుంటున్నారు. పోలీస్ వ్యవస్థ ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. నిబంధనల ప్రకారం పనిచేయాలి. ఇటీవలే చిలుకలూరిపేటలో సీఐ వ్యవహరించిన తీరును ప్రజలు గమనించారు. న్యాయస్థానాలు పోలీసుల తీరుపై చాలా ఘాటుగానే విమర్శిస్తున్నా స్పందించడం లేదు. ఐపీఎస్ ఆఫీసర్లు చట్టాల ప్రకారం వ్యవహరించకపోతే భవిష్యత్తులో న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబడాలి. కూటమి ప్రభుత్వం ఏం చెబితే గుడ్డిగా దానిని అనుసరించుకుంటూ పోతే దానికి వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కొందరు అధికారులు చట్టాలను అతిక్రమిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు

## భూసర్వేతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం

-మొదటిపేజీ తరువాయి

భూసర్వే చిన్న, సన్నకారు రైతులకు, మహిళలు, ఎస్సీ ఎస్టీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో భూ రికార్డుల డిజిటలైజేషన్ సజావుగా జరిగేలా చూడాలి" అని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

## మహిళల్లో అహల్య భాయి ధైర్యాన్ని నింపారు

-మొదటిపేజీ తరువాయి

మౌలిక సదుపాయాలు ఎంత అవసరమో గమనించి వాటిపై ఆనాడే దృష్టి పెట్టారని అన్నారు. ఇవాళ(గురువారం) బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకల ఏర్పాటుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు మీనాక్షి లేఖీ, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. మహిళల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం అహల్య భాయి హోల్కర్ చట్టసవరణలు చేశారని దగ్గుబాటి పురందేశ్వరి గుర్తుచేశారు. భర్తలు చనిపోయిన మహిళలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భర్త ఆస్తిలో.. ఆ భార్యకు హక్కు ఉంటుందని చట్టసవరణ చేసి మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. దళితులకు భూములు కేటాయించటం వారికీ సంక్షేమం అందించటంలో అహల్య భాయి ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. 1795వ సంవత్సరం ముందే ఇవన్నీ చేశారంటే అహల్య భాయికు ఎంత ముందు చూపు ఉందో అర్థమవుతుందని తెలిపారు. చేనేత రంగం వెనుకబడుతున్న పరిస్థితుల్లో మహేశ్వర్ అనే ప్రదేశంలో వారి ఉనికిని కాపాడారని అన్నారు. మహిళల్లో ధైర్యాన్ని అహల్య భాయి నింపారని దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అహల్య భాయి సేవా కార్యక్రమాల కోసం రాష్ట్ర ఖజానా నుంచి ఎప్పుడు ఒక్క రూపాయి తీసుకోలేదని దగ్గుబాటి పురందేశ్వరి గుర్తుచేశారు. పాశ్చాత్య దేశాలు మన దేశంలోని గుడులు గోపురాలపై దాడులు చేశాయని చెప్పారు. ఆలయాలను పరిరక్షించటానికి గర్భగుడి ఉండాలనే ఆలోచనలతో అహల్య భాయి నిర్మించారని అన్నారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశం వరకు ఎన్నో ఆలయాలను అహల్యభాయి నిర్మించారని చెప్పారు. మణికర్ణిక ఘాట్లు వ్యాపారానికి ఉపయోగపడేలా ఒక ఆలోచనతో పరిపాలన ఉండేదని అన్నారు. ఇలాంటి చాలా గొప్ప నిర్ణయాలు ఆలోచనలతో అహల్య భాయి పాలన ఉండేదని చెప్పారు. ఇలాంటి వ్యక్తుల ఆలోచన ఆదర్శంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని ఉద్ఘాటించారు. 11వ ఆర్థిక శక్తిగా ఉండే భారత్.. మోదీ హయాంలో 4వ ఆర్థిక శక్తిగా ఎదిగిందని గుర్తుచేశారు. జపాన్ దేశం కంటే ఆర్థిక శక్తిగా ముందుండే రోజులు రాబోతున్నాయని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.

**మహిళ సమాజం కోసం అహల్య భాయి కృషి: మీనాక్షి లేఖీ**

అహల్య భాయి ఒక మహిళగా సమాజం కోసం ఎంతగానో కృషి చేశారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి మీనాక్షి లేఖీ తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షి లేఖీ మీడియాతో మాట్లాడారు. 30సంవత్సరాల పరిపాలనలో అహల్య భాయి వినూత్న ఆలోచనలతో మహారాష్ట్రను వికసిత్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. పీశ్వాలకు ఉత్తర ప్రత్యుత్తరాలతో అహల్య భాయి చాతుర్యతను ప్రదర్శించారని చెప్పారు. మహిళ పీశ్వాలకు సైతం సమాధానం చెప్పి సమాజం కోసం అహల్య భాయి నిలబడ్డారని ఉద్ఘాటించారు. ట్రైబల్ మహిళల అభ్యున్నతి కోసం అహల్య భాయి ఆలోచనలు చేశారని తెలిపారు. కాశీ, రామేశ్వరం, శ్రీశైలం లాంటి దేవాలయాల నిర్మాణాలను అహల్య భాయి చేపట్టారని గుర్తుచేశారు. అహల్య భాయి దూర దృష్టితోనే మందిరాల పున:నిర్మాణాలు చేపట్టారని మీనాక్షి లేఖీ పేర్కొన్నారు.

## కడప రెడ్డమ్మ పగ తీర్చేసుకున్నారుగా

**కడప :** కడప జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి కసి తీర్చుకున్నారు. కడపలో ఫైర్ బ్రాండ్ లీడర్ గా మాధవి రెడ్డి గెలిచారు. గెలిచింది ఒకేసారి అయినప్పటికీ ఆమె నిత్యం వార్తల్లో ఉంటున్నారు. కడప రెడ్డమ్మగా ఆమె దూకుడుతో వ్యవహరిస్తున్న తీరు కొన్ని సార్లు విమర్శలకు ఎదురవుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. మాధవి రెడ్డి కడప జిల్లాలో టీడీపీలో ఫైర్ ఉన్న లీడర్ గా ఎదుగుతున్నారు. కడప జిల్లా వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కావడంతో మాధవీ రెడ్డి కి టీడీపీ కూడా అదే స్థాయిలో ప్రయారిటీ ఇస్తుంది. పార్టీ అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. తాజాగా కడప మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించి తన పవర్ ఏంటో మాధవిరెడ్డి చూపించగలిగారువైసీపీకి, సురేష్ బాబుకు సానుభూతి వస్తుందా? లేదా? అన్నది పక్కన పెడితే తాను అనుకున్నది సాధించడంలో మాధవి రెడ్డి ముందున్నారని మాత్రం చెప్పాలి. తాను శపథం చేసినట్లుగానే తనకు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో వేదికపై కుర్చీ ఇవ్వనందుకు చివరకు మేయర్ కుర్చీనే లాగేశారు. మున్సిపల్ నిబంధనలను అడ్డుపెట్టి మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించారు. మేయర్ సురేష్ బాబు తన కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులు అప్పగించారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా కడప మేయర్ సురేష్ బాబుపై వేటు వేసింది. దీంతో ఆయన కుర్చీ ఇవ్వనందుకు తన కుర్చీనే కోల్పోవాల్సి వచ్చింది. మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీ ఏడు నియోజకవర్గాల్లో గెలిచింది. పది శాసనసభ నియోజకవర్గాలున్న కడప జిల్లాలో తొలిసారి కూటమి పార్టీలకు ఇంతటి పెద్ద స్థాయిలో విజయం లభించింది. గతంలో ఇన్ని స్థానాలను టీడీపీ ఎప్పుడూ గెలవలేదు. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని సత్తా చాటింది. యితే కడప నియోజకవర్గంలో 1999లో గెలిచిన తర్వాత మళ్లీ టీడీపీ గెలిచింది 2024 లోనే. 1999 తర్వాత ఇక టీడీపీ అక్కడ గెలవలేదు. అంటే దాదాపు రెండున్నర దశాబ్దం కడప నియోజకవర్గంలో పసుపు జెండా ఎగురలేదనే చెప్పాలి. ఈసారి మాత్రం మాధవి రెడ్డి గెలిచి తన సత్తాను చాటారు. దీంతో ఆమెకు మంత్రి పదవి దక్కుతుందని భావించినా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా అది సాధ్యం కాలేదు. మాధవీ రెడ్డి భర్త కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి. తొలి నుంచి ఆయన కుటుంబం టీడీపీలోనే కొనసాగుతుంది. ఆర్థికంగా, సామాజికపరంగా బలమైన కుటుంబంగా పేరుంది. జగన్ సొంత జిల్లాలో అదీ కడపలో గెలవలేకపోయినా పార్టీ జెండాను రెడ్డప్పగారి కుటుంబం వదిలి పెట్టలేదు. ఈసారి మాత్రం తన సతీమణి మాధవరెడ్డికి టిక్కెట్ తెచ్చుకుని మరీ గెలిపించుకున్నారు. మాధవీ రెడ్డి గెలిచిన దగ్గర నుంచి స్పీడ్ గానే ఉన్నారు. కార్పొరేషన్ లో కుర్చీ కోసం చేస్తున్న గలాటా కూడా కొంత కాంట్రవర్సీగా మారినా ఆమె వెనక్కు తగ్గలేదు. కార్పొరేషన్ సమావేశంలోనే మాధవి రెడ్డి శపథం చేశారు. తనకు వేదికపై కుర్చీ వేయని నువ్వు కుర్చీలో ఉలా ఉంటావో చూస్తానంటూ వెళ్లిపోయారు. అనుకున్నట్లే మాధవి రెడ్డి అనుకున్నది సాధించారు.

**కాంట్రాక్టు పనులకు అప్పగించారని...**

మేయర్ ను సురేష్ బాబును ప్రభుత్వం తొలగించింది. మున్సిపల్ శాఖ నిబంధనలను ఉల్లంఘించి తమ బంధువులకు కాంట్రాక్టు పనులకు అప్పగించారన్న ఆరోపణలపై కడప మేయర్ సురేష్ బాబును ఆ పదవి నుంచి తొలగించింది. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించారని విచారణలో తేలిందని మున్సిపల్ శాఖ తెలిపింది. దీనిపై నోటీసులు ఇచ్చిన మున్సిపల్ శాఖ విచారణకు హాజరు కావాలని కోరింది. నిన్న సురేష్ బాబు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ శాఖ కార్యదర్శి ఎదుటహాజరయ్యారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులకు అప్పగించారన్న ఆరోపణలపై ఆయనను తొలగిస్తూ నిర్ణయిం తీసుకున్నారు. ప్రభుత్వం సురేష్ బాబుపై అనర్హతవేటు వేసింది.

## బుగ్గన పార్టీ మారుతున్నారా..

కర్నూలు : వైసీపీ ప్రభుత్వంలో తిరుగులేని స్థాయిలో చక్రం తిప్పిన ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. 2024 ఎన్నికలలో బుగ్గన పరాజయం పాలయ్యారు. కర్నూలు జిల్లా డోన్ లో తెలుగుదేశం అభ్యర్థి కోట్ల విజయం సాధించారు. డోన్ లో తెలుగుదేశం జెండా ఎగరడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. చంద్రబాబు వ్యూహం ఫలించి కోట్ల విజయం సాధించారు. బుగ్గన పరాజయం పాలయ్యారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఆర్థిక మంత్రిగా చక్రం తిప్పి, ఐదేళ్లూ వరుసగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన బుగ్గన ఆ ఓటమితో డోన్ లో అడ్రస్ లేకుండా పోయారు. అపర మేధావిలా అసెంబ్లీ లో వ్యవహరించిన ఆయన ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో తన వ్యాపార వ్యవహారాల కోసం జగన్‌కి హ్యాండ్ ఇచ్చే ఆలోచన చేస్తున్నారంట. అయితే కూటమి పార్టీలు నో ఎంట్రీ బోర్డు పెట్టడంతో ఏం చేయాలో తోచక అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారన్న టాక్ నడుస్తోంది.

## సంపాదకీయం

# ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్‌పాకిస్తాన్ వివాదంలో అనవసర జోక్యం, ధనిక దేశంగా లేదా సైనికశక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను వాడుకునే దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బతీశారు. యూరోపియన్ మిత్రదేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే ఉచిత సవారీదారులు అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్– ఉన్‌ను లిటిల్ రాకెట్ మాన్ అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్‌ను గందరగోళానికి గురిచేసింది. ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించకపోగా మిత్రదేశాలను దూరం చేసింది. ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. ఎక్స్‌లోని పోస్టులు ట్రంప్‌ను హిందీ సినిమాలో విలన్‌తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'అమెరికా గొప్పతనం' ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయింది. ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోడీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. భారత్ ప్రభుత్వం ఈ వాదనను ఖండించింది. ఇటీవల 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్ ప్రతిస్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తిగా ప్రజలు అనుకుంటున్నారు. ఆయన మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది. ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తాను అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్‌కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. 'ఎక్స్'లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు. ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనికశక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు. అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది. అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే. చిన్నదేశం అయినా, పెద్దదేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించకపోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా పెద్దన్న నాయకత్వ హోదాపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ట్రంప్ సుంకాల విధానాలు దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్‌లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బందిపెడుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పగా చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు. అయితే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ విడ్డూరంగా ఉండకూడదు. ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి. ఆయన ప్రవర్తనతో అమెరికా కు శత్రువులను పెంచుతుంది. మిత్రదేశాలు మధ్య విభజన జరుగుతుంది. ట్రంప్ దౌత్యవైఫల్యాలు ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్– పాకిస్తాన్ ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వంపట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కశ్మీర్ విషయంలో పూర్వచరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థికశక్తి, ఆయుధ శక్తితోనే పెద్దరికం రాదు. ఆయన మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బలప్రదర్శన, ఒత్తిళ్లు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం, మర్యాద ద్వారా లభిస్తుంది. ట్రంప్ నిరంతరం ఈ లక్ష్యాలను, విలువలను దెబ్బ తీశారు. అమెరికా తన గౌరవాన్ని పునరుద్ధరించాలి అంటే, విభజన, ఆధిపత్య వైఖరిని వదిలి, పరస్పర గౌరవం, సమన్వయంతో కూడిన దౌత్యాన్ని అనుసరించాలి.

# అలుపెరుగని పోరాట యోధుడు


యజుర్వేద శాఖీయులు అయిన పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి వర్ధంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 – మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933–34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941–42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937–39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940–42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60– 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు...వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940–42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు.

1944 – 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945–46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరఫున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు. సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం– గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది. పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు. "మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంథాలయం ఏర్పడ్డాయి.

# జీవుల మనుగడకు ఆధారం 'కాంతి'

విశ్వంలో కాంతి ఒక ప్రధాన భాగమే కాకుండా అత్యంత మౌళిక అంశంగా మారింది. అత్యంత సూక్ష్మ కణాల ధర్మాలను వర్ణించే క్వాంటం సైన్స్‌కు మూలాధారం కాంతి మాత్రమే. వేడి చేసిన వస్తువుల నుండి కాంతి కణాల లేదా ఫోటాన్ల ధర్మాల వరకు కాంతి శాస్త్రం వర్ణించబడుతుంది. ఫోటాన్స్ అంటే కాంతి సూక్ష్మ కణాలని అర్థం చేసుకోవాలి. కాంతికి పర్యాయపదంగా ఫోటాన్స్ నిలుస్తున్నాయి. కాంతి లేని భూగోళం శీతలం, బంజరు నేలల మయం. కాంతి ఎక్కడ ఉంటుందో అక్కడ జీవుల ఉనికి కనిపిస్తుంది. మానవాళి మనుగడకు కాంతితో అవిభాజ్య సంబంధం నెలకొని ఉన్నది. వైజ్ఞానిక శాస్త్ర అభివృద్ధి అంటే కాంతి దృగ్విషయాల శోధనలు మాత్రమే. కాంతి మాంద్యంగానే ప్రపంచ సూక్ష్మ విషయాలు అవగతం అవుతున్నాయి. 16 మే 1960 రోజున తొలిసారి భౌతికశాస్త్రజ్ఞుడైన ఇంజనీరు 'థియోడోర్ మైమాన్' కృషితో లేజర్ సర్జరీ జరిగింది. కాంతి పరిశోధనలతో ప్రత్యామ్నాయ శక్తి వనరులు, వైద్య రంగంలో ఒకచ్చితత్వంతో రోగ నిర్ధారణలు, చికిత్స మార్గాలు, హై–స్పీడ్ ఇంటర్నెట్ లాంటి అనేక ఆవిష్కరణలు నేటి ఆధునిక పౌర సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్నాయి. నేడు కాంతి ఆధార వైజ్ఞానికశాస్త్రం, టెక్నాలజీల పాత్ర అనన్య సామాన్య మైపోయింది. ఫోటోనిక్స్ ద్వారా నేడు ప్రపంచమంతటా అంతర్జాలం/కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ సమన్వయ పరచబడింది. ఆప్టికల్ టెక్నాలజీలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిమోట్ సెన్సింగ్ వ్యవస్థలు సుస్థిర వ్యవసాయానికి బాటలు వేస్తున్నాయి. కాంతి వల్లనే భూమి కుగ్రామం అయిపోయింది. వాతావరణ మార్పుల అధ్యయనాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం లాంటివి సుసాధ్యం అవుతున్నాయి. సమ్మిళిత అభివృద్ధి, ఆహార భద్రత, ఆకలికి సమాధానం కూడా కాంతి శాస్త్రం ఇవ్వగలుగుతున్నది. అగ్ర–ఫోటానిక్స్ వేదికగా సాగు పద్ధతుల్లో విప్లవాత్మక సకారాత్మక మార్పులు వస్తున్నాయి. శక్తిని ఆదా చేయడానికి ఎల్‌ఈడీ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. టెలీ–కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు కాంతి పునాదులు వేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది కంటి చూపు దోషాలను సవరించడానికి కాంతి–ఆధారిత భౌతిక శాస్త్రం దోహదపడుతున్నది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమాటిక్స్ – స్టెమ్ సమన్వయంతో సమ్మిళిత వైజ్ఞానికశాస్త్ర అభివృద్ధికి రాచ బాటలు పడుతున్నాయి. లింగ సమానకడక్వ సాధనకు మహిళలు, యువతులను కాంతి ఆధారిత పరిశోధనల వైపు మరల్చాలి. నేడు దాదాపు 28 శాతం మహిళలు పరిశోధనారంగాల్లో పని చేయడం జరుగుతోంది. శుద్ధ సురక్షిత తాగు నీటి లభ్యతకు ఫోటోనిక్స్ టెక్నాలజీలు ఉపయోగపడుతున్నాయి. ప్రపంచ శాంతి, సుస్థిరాభివృద్ధికి బాటలు వేస్తున్న కాంతి ప్రక్రియలను, కాంచి ప్రాధాన్యాలను వివరించడానికి, మరింత ప్రయోజనకరంగా మార్చడానికి ప్రతి ఏట 16 మే రోజున "అంతర్జాతీయ కాంతి దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ లైఫ్"ను పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాత కాంచి దినోత్సవ ఇతివృత్తంగా "మన జీవితాల్లో కాంతి (లైట్ ఇన్ అవర్ లైఫ్స్)" అనబడే అంశాన్ని తీసుకోని నిత్య జీవితంలో కాంతి ప్రాధాన్యాలను వివరించడంతో జరుగుతుంది. కాంతి అద్భుత ధర్మాలను లేదా కాంతి–ఆధారిత టెక్నాలజీలను సాధారణ మానవాళికి వివరించడం, కాంతి అంశంలో మరింత లోతైన పరిశోధనలను ప్రోత్సహించడం, కాంతితో కళలు/సంస్కృతి సంబంధాలను వర్ణించడం, కాంతి అనువర్తనాలను చర్చించడం, సుస్థిరాభివృద్ధిలో కాంతి సాంకేతికతను వాడుకోవడం లాంటి అంశాలతో పాటు శక్తిని సమర్థవంత వినియోగాలు, శక్తి నష్టాల నివారణ, కాంతి కాలుష్య కట్టడి లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. పునరుత్పాదక శక్తి వనరులు, మానవాళి కనీస అవసరాలు, వాతావరణ మార్పులు, కృత్రిమ ఉపగ్రహాలు లాంటివి కాంతి ఆధారంగానే జరుగుతున్నాయి. 2015 ఏడాదిని అంతర్జాతీయ కాంతి సంవత్సరంగా పాటించడం సత్ఫలితాలను ఇవ్వడంతో 2018 నుంచి యునెస్కో అంచర్జాతీయ కాంతి దినోత్సవాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. వైద్య ఆరోగ్య రంగాలు, ఇంటర్నెట్–కమ్యూనికేషన్ వ్యవస్థలు, సుస్థిర శక్తి వనరుల వాడకం, విద్యతో పాటు ఆవిష్కరణలు లాంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు సుసాధ్యం కావడానికి కాంతి–ఆధారిత ఆధునిక పరిజ్ఞానాలు దోహదపడుతున్నాయి. అంతర్జాతీయ కాంతి దినోత్సవ వేదికగా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఉపన్యాసాలు, వెబినార్లు, సదలేజర్–ఆప్టిక్స్ నమూనాల ప్రదర్శనలు, ఆర్ట్ – ఫోటోగ్రఫీ రంగాల్లో పోటీలు, ప్లానిటోరియం సందర్శనలు లాంటివి ఏర్పాటు చేయవచ్చు. ఈ వేదికలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు, ఫోటోగ్రాఫర్లు, ఆర్టిస్టులు, ఫోటోనిక్స్ టెక్నోక్రాట్లు పాల్గొని రేపటి తరానికి మార్గదర్శనం చేయాలి. కాంతిలో దాగిన విశ్వ రహస్యాలను బట్టబయలు చేయాలి, మానవాళి సరళ జీవన విధానాలకు బంగారు బాటలు వేయాలి. కాంతి ఆవిష్కరణలు కమ్యూనికేషన్, ఆరోగ్య, పర్యావరణ, వ్యవసాయం లాంటి అనేక రంగాల్లో సకారాత్మక మార్పులకు పునాదులు వేయాలి.

# దోమకాటుతో డెంగ్యూ వైరల్ వ్యాధి



రుతుపవనాలు ప్రారంభమయ్యే వర్షాకాలపై వేకువ జామున లేదా సాయంకాలం గడియల్లో వైరస్ సోకిన 'ఆడెస్ ఎజిప్టీ' వర్గపు దోమల కాటు వల్ల సంక్రమించే డెంగ్యూ వైరల్ నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా, చివరకు ప్రాణాంతకంగా కూడా మారుతుంది. నాలుగు రకాల డెంగ్యూ వ్యాధుల కట్టడి చేయడానికి, దోమలు పెరగకుండా పరిసరాల పరిశు భ్రతను పాటించడమే ఏకైక ఉత్తమ మార్గం అని తెలుసుకోవాలి. డెంగ్యూ వ్యాధికి చికిత్స ఉన్నప్పటికీ అశ్రద్ధ చేస్తే ప్రమాదకరంగా మారి ప్రాణాలను కూడా తీస్తుందని పౌర సమాజం అర్థం చేసుకోవాలి. డెంగ్యూ వ్యాధి ముఖ్య లక్షణాల్లో అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, నేత్రాల వెనుక నొప్పి, కండరాలు/కీళ్ల నొప్పులు, వాంతులు, అలసట, ముక్కు/చిగుర్ల నుంచి రక్తం కారడం, శారీరక బలహీనత, చర్మంపై దద్దుర్లు, బిపీ తగ్గడం, ప్లేట్లెట్ల సంఖ్య పడిపోవడం, చివరకు అవయవాల నిక్రియత్వం లాంటివి కనిపిస్తాయి. ప్రమాదకర ప్రజారోగ్య సమస్యగా మారిన డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించటానికి ప్రతి ఏట మే 16న భారత దేశవ్యాప్తంగా "జాతీయ డెంగ్యూ దినం" లేదా "నేషనల్ డెంగ్యూ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ వైద్య ఆరోగ్య యంత్రాంగం పాత్ర, వైద్య సిబ్బంది అంకితభావం, వ్యాధి పట్ల ప్రజలకు కనీస అవగాహన కల్పించడం, పరిసరాల పరిశు భ్రతకు పెద్ద పీట వేయడం, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడానికి చర్యలు తీసుకోవడం, పౌర సమాజాన్ని ఏకీకరణ చేయడం లాంటి లక్ష్యాలను చేపట్టడానికి జాతీయ డెంగ్యూ దినం వేదికలను వినియోగించుకోవాలి. జాతీయ డెంగ్యూ దినం–2025 ఇతివృత్తంగా "ప్రారంభం లోనే చర్యలు,డెంగ్యూ నివారణ : పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకర జీవన విధానం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భారత దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు నమోదు అయినప్పటికీ యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా పట్టణాల ప్రజల నుంచి పల్లెలకు ఈ వ్యాధి వ్యాపించడం జరుగుతున్నది. 2023లో దేశవ్యాప్తంగా 2.9 లక్షల కేసులు నమోదు కాగా 485 మరణాలు కూడా జరిగాయి. అదే విధంగా 2024లో 2.33 లక్షల రోగులు, 236 మరణాలు డెంగ్యూ వల్ల జరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, అకాల వర్షాలు కురవడం, ప్రజల్లోఅవగాహనలేమి, ప్రభుత్వాల చర్యలు మందగించడం లాంటి కారణాలతో డెంగ్యూ వ్యాప్తి పెరుగుతున్నది. ప్రణాళిక కొరవడిన పట్టణీకరణ కూడా డెంగ్యూ రెచ్చిపోవడానికి ఒక ప్రధాన కారణం అవుతున్నది. జాతీయ డెంగ్యూ దినం వేదికగా ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగాలు సమైక్యంగా పోరాడితే పలు అంటువ్యాధులు, సాంక్రమిక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. అస్తవ్యస్త పట్టణీకరణ, వాతావరణ ప్రతికూల మార్పులు, వర్షాకాల అపరిశుభ్రతలు డెంగ్యూ లాంటి సాంక్రమిక వ్యాధులకు తలుపులు తెరుస్తున్నట్లు అవుతున్నది. సరైన సమయంలో స్పందిస్తూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పౌర సమాజ చైతన్యం తగు రీతిలో కొనసాగితే డెంగ్యూ వ్యాధి కట్టడి సులభం అవుతుంది. మన స్వల్ప అశ్రద్ధ ప్రాణాంతకం కావద్దు. మన ఇంటి పరిసరాల పరిశుభ్రత మన కుటుంబ/సమాజ ఆరోగ్య ప్రదాయిని అని తెలుసుకుందాం. వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్న అనే నినాదాన్ని గుర్తుంచుకొని మన ఆరోగ్యం కోసం మనమే ప్రతినబూనుదాం, డెంగ్యూ కనబడని భారతాన్ని నిర్మించుకుందాం.

# మే20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## ఏఐటియుసి, సిఐటియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ

**బద్వేల్ మే 15 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలో గురువారం నాడు కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని, సమాన పనికి- సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షణ కోసం, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని మరియు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటియుసి- సిఐటియు ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో స్థానిక ఏఐటియుసి కార్యాలయం నందు కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి ఏరియా కార్యదర్శి పి.వి రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు లు సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం మీద బహుముఖ దాడి చేపట్టిందన్నారు. 95 శాతంగా ఉన్న కార్మికులకు తీవ్రమైన నష్టం చేకూర్చే విధంగా కార్మిక చట్టాలు,హక్కులపై దాడి చేస్తున్నారని, కార్మికులకు ప్రశ్నించే హక్కు లేకుండా,పని గంటలతో సంబంధం లేకుండా కార్మికులను కట్టు బానిసలుగా చేసే పరిస్థితి నేడు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.అనేక పథకాల్లో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ పథకాల్లో పని చేస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత లేకుండా అభద్రతతో జీవిస్తున్నారన్నారని, ప్రాణాలర్పించి 8 గంటల పని దినం,సమ్మె హక్కు,కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కులు సాధించు కొనగా,నేడు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు అప్పగించే పాలన సాగుతుందన్నారు. 27 కార్మిక



చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చేసి కార్మికులను బానిసలుగా మార్చే ప్రక్రియ మోడీ ప్రభుత్వం చేపట్టిందని,మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులపై దాడి పెరిగిందని,అందులో భాగంగా రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తే రైతులు ఏడాది పాటు 700 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయి తిప్పికొట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడాన్ని ప్రతిఘటించకపోతే కార్మిక వర్గానికి మనుగడ ప్రమాదంలో పడుతతుందన్నారు. ఇటువంటి నేపథ్యంలో పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను, సమ్మె చేసే హక్కును, కనీస వేతనాలు సాధన కోసం, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం కోసం మే 20 తేదీన జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెను పట్టణంలోని ఉద్యోగ- ఉపాధ్యాయ, కార్మిక,కర్షక, మేధావులు, వ్యాపారులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇరుపోతూ ఓబులేసు, పట్టణ నాయకులు నాగరపు సత్యరాజు,అమిలిపోగు బాబు,దియ్యాల వెంకటేశ్వర్లు, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ఈర్ల నగేష్,పట్టణ నాయకులు రషీద్,తంబీ,వెంకటేష్,పడిగే వెంకటరమణ,చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరి మండలంలో నకిలీ విలేకరులు. నకిలీ ప్రజాప్రతినిధులు

**మే. 15.ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్.శంకర్.** అనంతగిరి మండలంలో 24. గ్రామ పంచాయతీలు సుమారు 400. గ్రాములు 40,000 మంది జనాభా తో అనంతగిరి మండలం ఏర్పడి ఉంది. అంతా బాగున్న.నకిలీ విలేకరులు. నకిలీ ప్రజా ప్రతినిధుల హల్చల్.పాలన తో అధికారులు వ్యాపారులు. ప్రజలు. పరుగులు తీస్తున్నారు విలేకరుల విషయానికొస్తే గతంలో ప్రజల కోసం.ప్రజా సమస్యల కోసం. ప్రజాభివృద్ధి కోసం. వార్తలు రాసి ప్రభుత్వాన్ని దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యే మార్గం చూపేవారు.మండల వాసులకు తెలిసి ఐదుగురు విలేకరులు ఉండేవారు. నేడు అనంతగిరి మండలంలో డజన్ల కొద్ది విలేకరులు అంటూ తయారయ్యారు ఒరిజినల్ విలేకరులు ఎవరో.నకిలీ విలేకరులు ఎవ రో తెలియని దుస్థితి అన్ని వర్గాల వారికి ఏర్పడిందని.ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అంతేకాకుండా నకిలీ ప్రజా ప్రతినిధుల బాధ కూడా ఎక్కువైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి నకిలీలు కుమ్మక్కై వ్యాపారులను.అధికారులను కలిసి బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.వీరంతా చిలకల గేడ్డ. గుమ్మకోట ఎన్.ఆర్.పురం కాశీపట్నం వంటి ప్రధాన కేంద్రాల వద్ద మకాం వేసి కార్యకలాపాలుసాగిస్తున్నట్లు ప్రజా జ్యోతి కి అందిన సమాచారం. కనీసం పదవ తరగతి కూడా పాస్ అవని వారు సమాజం మీద అవగాహన లేని వారు ఇలా ప్రతి ఒక్కరు విలేకరులమంటూ పత్రికలకు ఉన్న విలువలను నాశనం చేస్తున్నారని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నకిలీ నాయకులు నకిలీ విలేకరులు ఇసుక వ్యాపారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలైన వ్యాపారులు బెంబేలెత్తుతూ మైదాన ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారని ప్రజలు బహిరంగచెప్పుకుంటున్నారు. వీరిపై నిగా పెట్టి పోలీస్ శాఖ విచారణ చేస్తే బాగోతం బట్టబయలు అవుతుంది . పత్రి?

# దర్గా ప్రహరీ గోడను కూల్చిన మున్సిపల్ అధికారుల్ని సస్పెండ్ చేయాలి

**ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి చాంద్ భాష**

**బద్వేల్ మే 15 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పట్టణం నందు జయ సుబ్బారెడ్డి కాలేజ్ ప్రక్కన గత 50 సంవత్సరాల క్రితం నుండి మాబు సుభాని దర్గా( జండా చెట్టు )ఉన్నది నిన్నటి దినం మున్సిపల్ అధికారులు దర్గా ప్రహరీ గోడను కూల్చివేశారు. ఈరోజు ఉదయం ముస్లిం నాయకులు కూల్చిన ప్రాంతానికి వెళ్లి పర్యటించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి చాంద్ భాష ,మాస్ కమిటీ అధ్యక్షులు ఎస్,అల్లా బకష్ ,ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా ,జిలాని భాష ,కౌన్సిలర్ మహమ్మద్ హుస్సేన్ లు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో ఇలాంటి ఘటనలకు పాల్పడడం బాధాకరం అన్నారు. ఇక్కడ 50 సంవత్సరాల నుండి దర్గా జండా చెట్టు ఉన్నది ఈ దర్గాకు హిందూ ముస్లిం సోదరులు ఇక్కడే ప్రార్థన చేసుకొని వెళ్లేవారు అలాంటిది మున్సిపల్ అధికారులు దర్గా ప్రహరీ గోడలను కూల్చి భక్తుల మనోభావాలు దెబ్బతీశారన్నారు. మందిరాలు ,మసీద్ లు దర్గాలు ,చర్చిలు ,ఇతర ప్రార్థన మందిరాలు ఇవి చాలా పవిత్రమైనవి,చాలా సున్నితమైనవి , ఏదైనా సమస్య వస్తే ఇరు వర్గాలు కూర్చొని మాట్లాడుకుని ఒకరికొకరు అర్థం చేసుకొని సమస్య పరిష్కారం చేసుకోవాలి ,అలాంటిది మున్సిపల్ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా దర్గా గోడను కూల్చడం జరిగిందన్నారు. వాస్తవంగా ఆ దర్గా ఏ రోడ్డుకు కూడా అడ్డంగా లేదు అలాంటిది దర్గా గోడ కూల్చడం చాలా దుర్మార్గం ,ఈ విషయం పైన బద్వేల్ మున్సిపల్ కమిషనర్ ని దర్గా గోడను ఎందుకు కూల్చారని వివరణ కోరగా రోడ్డుకు అడ్డంగా ఉన్నదని పొంతన లేని మాటలు చెప్పారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు



కూల్చిన ప్రహరీ గోడను నిర్మించి మతసామరస్యాన్ని కాపాడాలన్నారు. ప్రహరీ గోడను నిర్మించకుండా నిర్లక్ష్యం చేస్తే అన్ని రాజకీయ పార్టీలను ప్రజాసంఘాలను లౌకికవాదుల్ని భక్తులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిరాహార దీక్షలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ కార్యదర్శి అన్వర్ భాష ,ముస్లిం నాయకులు షరీఫ్,బాబ్జి ,మాహీర్ ,రెడ్డిభాష ,మౌలాలి. ఇబ్రహీం ,సర్దార్ ,మరియు ముస్లిం సోదరులు ,మహిళలు పాల్గొన్నారు.

# అరకు లోయలో జరుగుమినీ మహానాడుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు కదలి రావాలి.

**అరకు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సివేరి దున్నుదొర పిలుపు.**

**మే 15.ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్.శంకర్.** తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి పది మాసాలు కావస్తున్న సందర్భంలో ఈనెల 27. 28.29. తేదీలలో కడప జిల్లాలో నిర్వహించు రాష్ట్ర మహానాడు ను దృష్టిలో పెట్టుకుని ఈనెల 20.వ తేదీన. అరకు నియోజకవర్గం అరుకు మండల కేంద్రంలో ముందుగా మినీ మహానాడు కార్యక్రమం జరపడం జరుగుతుందని. అరకు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్.మరియు విజయనగరం జోనల్ ఆర్టీసీ చైర్మన్.శివేరి దోన్ను దొర గురువారం నాడు శివలింగపురం అతిథి గృహంలో మండల నాయకులు. కార్యకర్తల సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇస్తూ. మినీ మహానాడు పై పిలుపునిచ్చారు. నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పనిచేసి అభిమానులను తరలించి విజయవంతం చేయాలని కార్యక్రమంలో కోరారు. అదేవిధంగా ఈనెల 20వ తేదీ లోపు మండల. గ్రామ కమిటీలకు సంబంధించి న వివరాలను తనకు అందించాలని మండల నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండలం నాయకులు సోవేరి సుబ్బారావు.జె.చిట్టిబాబు. వి శంకర్రావు. పాంగి రవీంద్ర. పాంగి బాబి. భీమరాజు. బిడ్డ మహేష్. కి ముదు పండన్న. రామయ్య. జన్నిఅప్పారావు. భీం పోలు ఈశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.



# బద్వేల్ పట్టణ అభివృద్ధికి అమృత్ 2.0 పథకం కింద నిధులు మంజూరు




**బద్వేల్ మే 15 (ప్రజా జ్యోతి న్యూస్)** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ యం.ఏ.యు.డి అర్బన్ డెవలప్మెంట్ వారు ఆంధ్ర ప్రదేశ్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా అమృత్ 2.0 పథకం కింద జి.ఓ.యం.యస్ నం.82 తేదీ 13/05/2025 ప్రకారం బద్వేల్ పట్టణం నకు వాటర్ సప్లై మరియు సుందరీకరణ కింద నిధులు మంజూరు చేయడం జరిగింది. నాగులచెరువు పునరుద్ధరణ వ్యయం: రూ.2.20 కోట్లు. బలహీన వర్గాల హౌసింగ్ కాలనీలో తాగునీటి సౌకర్యాల కల్పన వ్యయం: రూ.23.10 కోట్లు. తాగునీటి సౌకర్యాల కల్పన వ్యయం: రూ.77.14 కోట్లు నిధులు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

# మంత్రి నారా లోకేష్‌తో పాటు పర్యటన కార్యక్రమంలో పాల్గొన్న సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**గార్లదిన్నె మే 15 ప్రజాజ్యోతి న్యూస్:** అనంతపురం జిల్లా మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం 1:20 గంటలకు గుత్తి మండలం బేతాపల్లి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ కు చేరుకున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ . అనంతపురం జిల్లా గుత్తి పట్టణం విచ్చేసినటువంటి ఐటీ %ఢ% విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గుత్తి పట్టణ పర్యటనలో భాగంగా సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొని ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి నారా లోకేష్ కి ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంతకల్ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిరంతరం పార్టీ కోసం కష్టపడి పార్టి విజయం కోసం కృషి చేసి ఎల్లవేళలా పార్టీ కోసం పని చేస్తున్నటువంటి ఉత్తమ కార్యకర్తలను గుర్తించి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా మెమొంటో అందజేయడం జరిగినది ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి హామీ శ్రామికులలకు మజ్జిగ పంపిణీ.




**పాలకొల్లు. ప్రజా జ్యోతి న్యూస్. (కొట్టి రామం.) మే 15.** రాష్ట్ర మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు అదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలలో గురువారం ఉపాధి హామీ పనులలో పాల్గొన్న శ్రామికులకు తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. పోడూరు మండలం పెనుమదంలో ఉపాధి హామీ శ్రామికులకు పెనుమదం నీటి సంఘం అధ్యక్షుడు దేవరపు దొరబాబు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు సూచనలను అనుసరించి ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ శ్రామికులకు వచ్చేనెల 5 వరకు పని సమయంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చెయ్యటం జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్ తానేటి బాబూరావు జనసేన బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# షెడ్యూల్ కులాల రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు... ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస బాబు

పోలవరం మండలంలోని నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న, షెడ్యూల్ కులాల రుణాల కోసం ఓబి ఎంఎంఎస్ ద్వారా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 20.5.2025,,,,, 21.5.2025 (రెండు రోజులు) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస బాబు తెలిపారు. మండలంలోని అభ్యర్థులు తమ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని ఎంపీడీవో కార్యాలయమునకు హాజరు కావాలని ఆయన కోరారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బ్యాంకర్ల ద్వారా అప్లికేషన్లు పరిశీలన మరియు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. అభ్యర్థులు తీసుకురావాల్సిన పత్రాలు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రము, విద్యార్హత నకలు కాపీలు మరియు అభ్యర్థి యొక్క పాస్పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని ఎంపీడీవో కార్యాలయమునకు రావాలని ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస బాబు అన్నారు.

# అన్నదాత సుఖీభవ జాడేది?

**పెట్టుబడి సాయం కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న రైతన్నలు**

**ఖరీఫ్ సమయం వస్తున్న రైతులను అందని సాయం**

**రైతులను పూర్తిస్థాయిలో దగా చేసిన కూటమి ప్రభుత్వం**

**పెట్టుబడులు కోసం అప్పులు చేస్తున్న రైతులు**

**రైతన్నలకు ఇచ్చిన హామీని తక్షణమే కూటమి అమలు చేయాలి**

**వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు**



**ఆమదాలవలస , ప్రజా జ్యోతి న్యూస్ :** రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అన్నదాతకు అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతీ ఏటా రూ. 20 వేలు అందిస్తామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ విషయాన్నే విస్మరించిందని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు అన్నారు. ఆమదాలవలస పరిధిలో తన కార్యాలయంలో పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రకృతి వైపరీత్యాల రీత్యా నష్టపోయిన రైతులను ఆదుకోకుండా కూటమి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని అంచనాలకే పరిమితం చేసిందన్నారు. రబీ పంటలలో పెట్టిన పెట్టుబడులు చేతికి అందక పోయినప్పటికీ వస్తున్నా ఖరీఫ్ సీజన్ మీద రైతన్నలు గుప్పుడు ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతన్నల ఆశలకు తూట్లు పొడిస్తుందన్నారు. రైతులకు ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. ఖరీఫ్ కు ముందుగానే పెట్టుబడి సాయంగా రూ 20 వేలు అందించి రైతులకు అండగా ఉంటామని చెప్పిన హామీని అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సాయం కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న రైతులకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితులు కూటమి ప్రభుత్వంలో ఎదురు అవుతున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయడు అధికారంలోకి వచ్చాక కౌలు రైతులను గాలికొదిలేశారన్నారు.జగన్మోహన్ రెడ్డి హయంలో కౌలు రైతులకు పెద్ద పేట వేశారని , పంట నష్టం వచ్చిన కౌలు రైతులను ఆదుకున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి హయంలో రైతన్నలకు సాగుకు ముందే పెట్టుబడి సాయం అందించి అన్నదాతలకు అండగా నిలిచిందన్నారు. రైతు భరోసా తో విడతల వారీగా రైతులను ఆదుకున్న ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వం అని కొనియాడారు. చంద్రబాబు ప్రకటించిన అన్నదాత సుఖీభవ ఊసే లేకపోవడం తో ప్రతీ ఒక్క రైతు జగన్మోహన్ రెడ్డి అమలు పరిచిన రైతు భరోసా ను తలుచుకుంటున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రైతులకు ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం సాయం చేయలేదని ఇప్పటికైనా నమ్ముకున్న రైతులను ఆదుకుని,తక్షణమే కూటమి ప్రభుత్వం ఎన్నికలలో రైతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ కు సమయం తక్కువ ఉందని రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

# అందుబాటులోకి పిఏసిఎస్ ఆన్లైన్ సేవలు

**కంప్యూటీకరణ తో పెరిగిన పారదర్శకత**

**సులభతరంగా రుణాలు , ఎరువులు , విత్తనాలు పొందే అవకాశం**

**ప్రతీ ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**వ్యవసాయ పరపతి సంఘం సి.ఈ. ఓ వై పాపినాయుడు**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** గ్రామీణ ప్రాంత రైతులకు మరింత మేలు చేకూర్చేందుకు వ్యవసాయ సహకార పరపతి సంఘం సేవలను గత నెల ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ఆన్లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని పిఏసిఎస్ సి.ఈ. ఓ వై పాపినాయుడు అన్నారు. పొందూరు మండల కేంద్రంలో పిఏసిఎస్ కార్యాలయం వద్ద ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా పిఏసిఎస్ సేవలను అందుబాటులోకి తీసుకు రావడం రైతులకు చాలా ఉపయోగకరమని తెలిపారు. దీని వలన రైతులు రుణాలు , విత్తనాలు , ఎరువులు ,ఇతర వ్యవసాయ సేవలను సులభతరంగా పొందవచ్చునని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా రైతులు రుణాలు కోసం నెల తరబడి ఎదురు చూడకుండా రుణాలకు దరఖాస్తు చేసుకున్న మరుసటి రోజుకే రుణాలు అందేలా అందుబాటులోకి సేవలను కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావడం జరిగిందన్నారు. వ్యవసాయ పరపతి సంఘం పనితీరులో మరింత పారదర్శకత పెరిగేందుకు కంప్యూ టీ కరణ దోహదం చేస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో మదర్ మల్టీస్ స్పెషల్ హాస్పిటల్ ఉచిత ఉచిత మెగా వైద్యం శిబిరం

**డి.ఎస్.పి వెంకటేశ్వరరావు**





**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ మే 15** ఏలూరు జిల్లా పోలవరం పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో మదర్ మల్టీస్ స్పెషల్ హాస్పిటల్ వారి ఉచిత ఉచిత మెగా వైద్యం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్పి కె పి శివకిషోర్ ఆదేశాల మేరకు పోలీస్ ప్రజల మధ్య స్నేహ భావం తో మమేకంగా ఉండడం కోసం ఫ్రెండ్లీ పోలీసుల మెలగడం విద్యా, వైద్యం పై ప్రజలకు అవగాహన సేవా కార్యక్రమంలు కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు . పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ బాల సురేష్ బాబు, ఎస్సై పవన్ కుమార్ ఈ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ ఉచితమేగా శిబిరం సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## మృతి చెందిన గిరిజన గర్భిణీ తామా శిరీష కుటుంబాన్ని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పరామర్శ



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ మే 15** ఏలూరు జిల్లా పోలవరం మండలం పోలవరం లో సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన గిరిజన గర్భిణీ తామా శిరీష కుటుంబాన్ని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు గురువారం పరామర్శించారు. కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన వైద్యులపై చట్టప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఉపాధి హామీ కూలీలంతా సమ్మెలో పాల్గొనాలి.



**పోదూరు /ఆచంట.మే 15,ప్రజాజ్యోతిన్యూస్.** కేంద్ర ప్రభుత్వానికి ఉపాధి హామీ కూలీలు పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ చట్టానికి బడ్జెట్లో అత్యధిక నిధులు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సిర్రా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆచంట మండలం పెనుమంచిలి గ్రామంలో తాడేరు మురుగు కాలువ వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు కూలి రేట్లు పెంచాలని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం నరసింహమూర్తి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరుగునున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నీరుగార్చడానికి చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండలు మురుగు కాలువ శుభ్రం చేస్తున్న నిర్దిష్ట కూలి రూ 307 కూడా రావడం లేదని, కనీసం జీవించడానికి రు 307 లు ఎలా సరిపోతాయని అయినా వాపోయారు. దేశంలో కార్పొరేట్ సంపన్న వర్గాలపై ఉన్న ప్రేమ పేద ప్రజలపై లేదన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఉపాధి హామీ చట్టం ఎవరి భిక్షతో వచ్చింది కాదని, వామపక్షాల కృషితో 2005 ముందు యుపిఏ గవర్నమెంట్ పై ఒత్తిడి తెచ్చి సాధించుకున్న చట్టం అని ఆయన అన్నారు. ఈ సమ్మెలో ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని ఉపాధి సమస్యలు పరిష్కారం కోసం, ఉపాధి నిధులు పెంచడం కోసం కూలీలంతా ఒక్కరోజు పని మానివేసి సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి మోహన్ రావు, వర్గనపు శ్రీరాములు, సత్యనారాయణ, మానుకొండ వీర్రాజు, నాగవేణి, వెంకటలక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.


## ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కు శుభాకాంక్షల వెల్లువ



**మే 15,తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజా జ్యోతి)**ఆ చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గం - తిరుపతి రూరల్ అధ్యక్షులు వెంకట్ రాయల్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ రాయల్ మాట్లాడుతూ జనసేన పార్టీ లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు , నాయకులకి పార్టీ అధ్యక్షులు, ఆంధ్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తప్పకుండ తగు న్యాయం చేస్తారని...నిస్వార్థంగా పార్టీ కొరకు మరియు కూటమి గెలుపు కొరకు కష్టపడిన పసుపులేటి హరిప్రసాద్ కు హస్తకళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రావడంతో అది రుజువు అయిందని స్పష్టం చేసారు...ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు ప్రతాప్ రెడ్డి , యుగంధర్ రాయల్, సమర తదితరులు పాల్గొన్నారు...

## కొంతంగి విద్యార్థికి పాలిసెట్లో రాష్ట్ర మొదటి ర్యాంకు....

**ఫోన్లో అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**



**ప్రతిపాడు నియోజకవర్గం ప్రజా జ్యోతి రిపోర్టర్ బీవస్స్ ప్రసాద్** శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బద్ది లోవరాజు కుమారుడు శశి వెంకట్ ఇటీవల జరిగిన పదో తరగతి %జరీూజు% పరీక్షల్లో 484/500 మార్కులు, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (%ూూ=జిజ జజు%) లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు, పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్టులో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినందుకు గౌరవ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా శశి వెంకట్ ను అభినందించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సత్య ప్రభ శశి వెంకట్ కి ఫోన్ చేసి ఫోన్లో అభినందనలు తెలిపారు..నీ ర్యాంకుతో నియోజకవర్గంలో యువకులకు స్ఫూర్తినింపావని , బస్సు సౌకర్యం కూడా లేని గ్రామం నుండి విద్యాభ్యాసం కొనసాగించి, రాష్ట్రస్థాయిలో ర్యాంకుల సాధించడం అద్భుతమైన విషయమని అన్నారు..ఇదే స్ఫూర్తితో ఉన్నత స్థాయి విద్యాభ్యాసం కొనసాగించాలని, జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని , భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలవాలని కోరుకుంటున్నాను అని శశి వెంకట తో ఎమ్మెల్యే అన్నారు..

## పి.హెచ్ సి.లకు లక్ష రూపాయలు విరాళం అందించిన కడప జిల్లా డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్ మే 15 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలో గురువారం నాడు బద్వేల్ టిడిపి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ యువ నేత రితేష్ రెడ్డి గారి సూచనల మేరకు కడప డిసిసిబి చైర్మన్ సూర్య నారాయణరెడ్డి గారు గాంధీనగర్ మరియు సురేంద్ర నగర్ పీ.హెచ్ సి.లకు అత్యవసర మౌలిక సదుపాయాల కల్పన కొరకు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా వారిని పి.హెచ్.సి సిబ్బంది గౌరవప్రదంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి ,డాక్టర్లు, హెల్త్ సూపర్వైజర్ మరియు పి.హెచ్ సి. సిబ్బంది పాల్గొన్నారు.


## చేనేత వాడలో అమ్మవారి పండుగకు విరాళాల సేకరణ

**తమ వంతు ఆర్థిక సహాయం అందించిన పలువురు దాతలు**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ ను జూన్ 17 వ తేదిన దిగ్విజయంగా నిర్వహించేందుకు అమ్మవారి పండుగ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు గురువారం నాడుమండల కేంద్రంలో చేనేత వాడలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఇందులో భాగంగా కాలెపు శ్రీనివాస రావు ( కె.వి.ఆర్ థియేటర్స్ ) రూ. 25 వేలు , యర్రా కిరణ్ అండ్ కిషోర్ బ్రదర్స్ రూ. 22,222 , కాలెపు శ్రీనివాస రావు ,మహేష్ బ్రదర్స్ ( మాజీ ఎంపీటీసీ ) రూ. 20 వేలు , వీరితో పాటు పలువురు దాతలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చిగిల పల్లి రామ్మోహన్ , మొగదాల రమణ రావు , రాంబిల్లి నాగరాజు , కోరుకొండ విజయ్ కుమార్ , అనకాపల్లి శివ కుమార్ , కోరుకొండ రాజశేఖర్ , గుంటుకు రాము , అనకాపల్లి గోవింద్ ,అనెమ్ పాపారావు , పాలిశెట్టి సూర్యం , రాయిపిల్లి రాంబాబు , మాసాడ భోగిరాజు , పట్నాన శ్రీనివాస రావు , మన్నాన వెంకట రావు , గిడిజాల భాస్కర రావు , గుడ్ల సాయి రాజు , యర్రా సతీష్ కుమార్ , కాకర్ల సాయి, మల్లిక భుజంగ రావు తదితర పండుగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి



**బద్వేల్ మే 15 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేలు నియోజకవర్గంలోని గోపవరం మండలం పి.పి.కుంట గ్రామానికి చెందిన మునగల సునీల్, లలిత దంపతుల ఏకైక కుమారుడు క్రాంతి కుమార్ వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో మాజీ కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, మండల కన్వీనర్ రవి చంద్రారెడ్డి, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు సుందర్ రామిరెడ్డి, పార్టీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, నరసింహారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం గ్రామంలో మురళిరాజు పర్యటన

**విష్ణు పలకరించిన మురళిరాజు**



**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్. వీర బాబు** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం లో చిట్టూరి విష్ణు ఇటీవల కాలంలో ఆరోగ్యం బాగోను కారణంగా వారిని పలకరించి ఆరోగ్య విష రాలు అడిగి తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు%ది% ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు మరియు వైస్సార్సీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కూలి పనికి కొలతలెందుకు?




**పోడూరు /పెనుగొండ మే15,ప్రజాజ్యోతిన్యూస్.** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం లో పనికి కొలతలు పెట్టి వేతనాన్ని చెల్లించడంలో శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పెనుగొండ మండల కార్యదర్శి ఎస్కె పాదుషా అన్నారు. గురువారం దొంగరావిపాలెం బ్యాంకు కెనాల్ లో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడిన సందర్భంగా కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ 307/-చొప్పున కాకుండా రూ 200 నుండి 270/-మధ్యలో తక్కువ చెల్లింపులు జరుగుతున్నాయని అన్నారు.కూలి పనికి కొలతలు పెట్టడం కూలి దోపిడీ చేయడానికేనని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు చెల్లించవలసిన న్యాయమైన కూలి రేటు రూ 307/-చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు ప్రమాద బీమా పేరుతో రాష్ట్రం సంవత్సరానికి రూ 20/-, కేంద్రానికి నెలకు మరికొంత మొత్తం ఉపాధి కూలీలు చెల్లించాలని చెప్పి వసూలు చేయడం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచి పెట్టడానికే ఉపయోగపడుతుందని అన్నారు. ఉపాధి పనికి వెళ్లే సమయంలో గానీ, పని నుండి తిరిగి వచ్చే సమయంలో గాని, పని సమయంలో గానీ ప్రమాదం జరిగితే ఆ బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేని, వారికి నష్ట పరిహారం నేరుగా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ లను పెంచి పోషించడానికి కూలీల చేత డబ్బులు కట్టించడం అన్యాయమన్నారు. సంవత్సరానికి వంద రోజులు పని చూపిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు పట్టుమని నెలరోజులు కూడా చెప్పడం లేదని, ఒకవైపు వేతన బకాయిలు పెడుతూ, మరోవైపుఇన్సూరెన్స్ కు డబ్బులు కట్టాలని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఉపాధి పనిని 200 రోజులకు పెంచి కూలి రేటు రూ. 600/- రూపాయలు చేసినప్పుడే వారి పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. ఉపాధి పని నిర్వహణలో నిబంధనలు గాలికి వదిలేసి కూలీలకు ఇవ్వాల్సిన వేసవి అలవెన్సు కూడా రద్దు చేసిన ఈ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పే విధంగా మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు మరియు మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## నకిలీ సర్టిఫికేట్ తో ఉద్యోగం


అంగన్వాడీ సహాయకురాలి గా విధులలోకి చేరిన మహిళ

గ్రీవెన్స్ లో పిర్యాదు చేసిన గ్రామ వాసి

కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళను ఉద్యోగం నుండి తొలగించిన అమదాలవలస సిడిపిఓ

**పొందూరు , జ్యోతి న్యూస్ :** మండలం బాపిరాజు పేట గ్రామానికి చెందిన బి సుగుణ నకిలీ 10 వ తరగతి సర్టిఫికెట్ తో అంగన్వాడీ కేంద్రంలో సహాయకురాలిగా 2015 లో విధులలోకి చేరింది. దీంతో అదే గ్రామానికి చెందిన శూరి కిరణ్ ఈ విషయం పై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ఈయన పిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఈ విషయం పై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనితో ఆమదాలవలస సి.డి.పి. ఓ అనురాధ, సంబంధిత సెక్టార్ సూపర్ వైజర్ మార్చి 29 వ తేదీన బాపిరాజు పేట అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిర్యాదు దారుని సమక్షంలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా బి సుగుణ ను 10 వ తరగతి సర్టిఫికెట్ చూపించవల్సిందిగా కోరగా ఆమె తన వద్ద సర్టిఫికెట్ లేదని రెండు రోజులు గడువు కావాలని కోరారు. రెండు రోజులు గడిచినా సర్టిఫికెట్ సమర్పించకపోవడం తో 30 రోజుల లోగా ధ్రువ పత్రాన్ని సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో కూడా ఎస్.ఎం.పురం ప్రాజెక్ట్ పరిధిలో బాపిరాజు పేట ఉన్న నేపథ్యంలో ఈమె పిర్యాదు చేయగా ఆ సమయంలో ఈమె నాల్గవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నది అని,ఆమె గతంలో చూపించిన సర్టిఫికెట్ ఆంధ్రా యూనివర్సిటీ నుండి పొందు పరచినది కాదని నిర్ధారణ అయింది. దీంతో ఇచ్చిన 30 రోజుల గడువు పూర్తి కాగా ఆమె ధ్రువ పత్రం సమర్పించక పోవడంతో ఆమెను విధుల నుండి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు సి.డి.పి. ఓ ఉత్తర్వులు జారీ చేశారు..

## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో యోగా సమ్మర్ స్పెషల్ క్యాంప్




**మే 15,తిరుపతి జిల్లా (ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో రేపటి నుండి నెల రోజులపాటు ప్రత్యేక యోగ సమ్మర్ స్పెషల్ క్యాంప్ విశ్వవిద్యాలయంలోని యోగ విజ్ఞాన విభాగం ద్వారా నిర్వహించడం జరుగుతుంది. ప్రతిరోజు రెండు గంటల పాటు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు యోగ విజ్ఞాన విభాగం దగ్గర ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జాయిన్ అవ్వాలి అనుకునేవారు రూపాయలు 1500 రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవచ్చు. సంస్కృత పతంజలి యోగ సూత్రాలను అనుసరించి శాస్త్రీయ పద్ధతిలో ఆసనాలు, ప్రాణాయామం మరియు క్రియలు మొదలైనటువంటి వాటిని ప్రత్యేకించి బోధిస్తూ స్ట్రెస్ నుండి టెన్షన్ నుండి మనసును ప్రశాంతంగా ఏవిధంగా ఉంచుకోవాలో అనేటువంటి దానిపైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.ఉత్సాహం కలిగినటువంటి 12 సంవత్సరాలు నిండిన ఎవరైనా గాని ఈ యొక్క కోర్సులో జాయిన్ అవ్వచ్చు. డైరెక్టు యోగవిజ్ఞాన విభాగం దగ్గరికి వచ్చి స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకుని ఈ తరగతుల్లో శిక్షణ పొందవచ్చు.

## దహన సంస్కారాలను కర్రల వితరణ

చేసిన టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు





**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం రాపాక గ్రామంలో కాలం చెల్లించి స్వర్గధామం లో దహన సంస్కారాలు చేసేందుకు గ్రామస్తులకు సరైన స్మశాన వాటిక సౌకర్యం ఉన్నప్పటికీ కర్రలు కోసం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ వ్యక్తి మరణించిన ముందుగా దహన సంస్కారాలు కోసం అందుకోగా కర్రలను సమకూర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అటువంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఏ వ్యక్తి మరణించిన కుటుంబ సభ్యులు కట్టెల కోసం వేతకుండా ఏడాది పాటు దహన సంస్కారాలకు సరిపడా కర్రలను టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు వితరణ చేశారు. దీంతో గ్రామస్తులు ఆయన సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు .

## అన్నమయ్య కళా క్షేత్రం వారిచే భజన బృందం గురువులకు అవార్డుల ప్రధానం



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు, ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం ద్వారక తిరుమలలో అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో భజన బృందం గురువులకు అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీ విజయశంకర స్వామి వారి చేతుల మీదుగా అన్నమయ్య అవార్డుల ప్రధానోత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అన్నమయ్య కళా పరిషత్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కాకినాడ జిల్లా అన్నమయ్య కళా పరిషత్ అధ్యక్షులు అన్నమయ్య సానా నూకరాజు నాయుడు,జిల్లా కమిటీ సభ్యులు దాసరి సూర్యనారాయణ,పైలా అప్పలనాయుడు,ఇతర జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వాగత ర్యాలికి భారీ గాతరలి వెళ్లిన పసుపు సైన్యం



**తాళ్లపూడి మండలం, మే15, ప్రజా జ్యోతి న్యూస్** రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కు ఘన స్వాగతం పలకడానికి తాళ్లపూడి తెలుగుదేశం పార్టీ నాయకులు ఆత్కూరి రాంబాబు, నామా.సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో తరలిన పసుపు సైన్యం ఈ సందర్భంగా నామాసురేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ గా కె. ఎస్. జవహర్ కు అత్యున్నత స్థానం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. తాళ్లపూడి మండలం నుండి వందలాది నాయకులు కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలకడానికి బయలుదేరి వెళు తున్నామని సురేంద్ర అన్నారు ఈ కార్య క్రమంలో, కొప్పాక నరసయ్య, మేరిపోవెం కట్రావు, కొప్పాక పొసియ్య,మల్లిపూడిరాంబాబుకొడమంచిలి ఇమ్ము, అక్కా బత్తులక్ష్మణ్ కుమార్, వీర వెంకటరావు,వృత్తి,ప్రశాంత్, శ్రీధర్,సాయి, వినోద్ , విజయ్, నితీష్ , జస్సీ,పెంటా సతీష్ , తదితరులు ఉన్నారు

## చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే మా ఆశయం..

కుప్పం నియోజకవర్గం రాంకుప్పం మండలం లింగాపురం గ్రామస్తులు..




**మే 15,తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులు చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రామకుప్పం మండలం టిడిపి అధ్యక్షులు ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో లింగాపురం గ్రామస్తులు అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి ముక్కులు తీర్చుకుని శ్రీవారి దర్శనానికి అలిపిరి మార్గం గుండా కాలినడకన తిరుమలకు వెళ్లారు.ఈ సందర్భంగా రాంపూర్ టీడీపీ మండలం అధ్యక్షులు ఆనంద రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ఎన్నికల ముందు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కి మొక్కుకున్నామని నేడు ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారు. నేడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ముక్కులు తీర్చుకునేందుకు తిరుపతి వచ్చామని తెలిపారు .ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గం నుంచి విచ్చేసిన చంద్రబాబు నాయుడు అభిమానులకు భోజన సౌకర్యాలను స్థానిక బిసి నాయకులు జగన్నాథం ఏర్పాటు చేశారు..

## కార్పొరేట్ విద్యా సంస్థలలకు కొమ్ము కాస్తున్న ఆర్ ఐ ఓ ను సస్పెండ్ చేయాలి.- ఎస్ఎఫ్ఐ



**మే 15,తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో ఇంటర్ బోర్డు ఇంటర్ విద్యా లో సంస్కరణ తీసుకొచ్చి ముందుగానే ఏప్రిల్ 1 నుంచి తరగతులు మొదలు పెట్టి 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులు ఇచ్చింది అని, తిరుపతి జిల్లా లో మాత్రం బోర్డ్ నిబంధనలు పాటించేలా %=×ºº% గారు విఫలం చెందారని తక్షణమే ఆయాంట్ %=×º% ను సస్పెండ్ చేయాలనీ %ఆశీ×% ఆధ్వర్యంలో గురువారం జాయింట్ కలెక్టర్ గారికి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా లో బోర్డు నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న కళాశాల లో విద్యార్థులను మానసిక ఒత్తిడి నుంచి కాపాడాలి అని ఇంతకు ముందే %=×º% గారి దృష్టిలో ఉంచిన ఎలాంటి చర్యలు తీసుకోపోగా ఉద్దేశంగా తీసవిలో తరగతులు నిర్వహిస్తున్న కళాశాల లకు కొమ్ము కాస్తున్నారని వారు అన్నారు. విద్యార్థులు అనేకమంది %ఆశీ×% సోషల్ మీడియా పేజీ లలో మెసేజ్ లు చేస్తూ వారికి మానసిక ఒత్తిడి నుంచి కాపాడాలని, సెలవులు కావాలని అంటూ ప్రతి రోజు విద్యార్థులు బాధ పడుతూ అవస్థలుపడుతున్నారని వారు జేసీ దృష్టి కు తీసుకెళ్లి వివరించారు. రకరకాల కోచింగ్ పేర్లతో ఇంటర్ 1,2 సంవత్సరం క్లాస్ లు నిర్వహిస్తూ సెలవులు లేకుండ విద్యార్థులను హింసిస్తున్న %=×º% గా నియంత్రణ అధికారి తమ భాధ్యతలను మరిచి ఆ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారు అని అలాంటి %=×º% ను తక్షణమే సస్పెండ్ చేసి, ఇంటర్ బోర్డ్ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకునే %=×º% ను నియమించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా లోని ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించని కళాశాల లపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో %ఆశీ×% జిల్లా కార్యదర్శి భరత్ రవి, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, నగర కార్యదర్శి తేజ, జిల్లా నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.


## జవహర్ కు ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు పసుపుమయం అయిన కొవ్వూరు



**తాళ్లపూడి మండలం, మే15, ప్రజాజ్యోతి న్యూస్** రాష్ట్ర ఎస్సీ చైర్మన్ గా నియమితులై మొదటిసారిగా కొవ్వూరు నియోజకవర్గానికి విచ్చేసిన కె. ఎస్. జవహర్ కు కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. పంగిడిలో పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు క్రేన్ తో భారీ గజమాలతో సత్కరించి బాణాసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు సందర్భంగా పంగిడి నుంచి ఆయన అభిమానులు కొవ్వూరు వరకు బారీ ర్యాలీ గా ఆయన నివాసం చేరుకున్నారు. రహదారి పొడవునా ఎటు చూసినా జన సంద్రంతో అభిమానుల సందడితో కొవ్వూరు పసుపు మయంగా మారింది. ఈ సందర్భంగా పట్టణం లోని బాబు జగజ్జీవనరామ్, అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు జవహర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూరుగుపల్లి వీర రాఘవులు, వేగి చిన్నా , కొఠారిప్రసాద్, ఆత్కూరి రాంబాబు, నామా సురేంద్రకుమార్, పీకే రంగారావు, ఆత్కూరి రాంబాబు, కాశీ నవీన్ కుమార్, పసలపూడి బోస్,కొప్పాక నరసయ్య, కొప్పాక పొసియ్య, మెరిపో వెంకట్రావు, కొప్పాక నరసయ్య తో, మల్లిపూడి రాంబాబు,తో పాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## అచ్చంపేట గ్రామంలో మురళిరాజు పర్యటన

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రతిపాడు నియోజకవర్గం



కుందల వారి వివాహ వేడుకలో పాల్గొన్న మురళిరాజు శంఖవరం మండలం అచ్చంపేట గ్రామంలో కుందల శీను కుమార్తె వివాహ కార్యక్రమానికి హాజరైన ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు %ల% నరసాపురం పార్లమెంటు పరిశీలకులు%ల% ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో శంఖవరం మాజీ జడ్పిటిసి ఈగల అప్పారావు ,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు ,అంబటి గణేష్,వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అంధకారంలో కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి..



**కొత్తూరు మే15, ప్రజా జ్యోతి న్యూస్..** నిధులేక ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలు.. దయచేసి దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రండి.. కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జనరేటర్ ఉన్నా పనిచేయక నానా ఇబ్బందులు పడుతున్న బాలింతలు.. పసిపిల్లలు.. రోగులు నిన్న కరెంటు లేక సెల్ ఫోన్ లైట్ల వెలుగులో కాలం గడుపుకున్న బాలింతలు జనరేటర్ కోసం దాతలు ఉంటే పెద్ద హృదయంతో ముందుకు వచ్చి నిస్వార్థంగా వారికి సహాయం చేయండి.. చేతిపంపులు, త్రాగునీరు ఇచ్చిన దాతలను చూసి కాస్త ఆలోచించి వారిలాగే ముందుకు దాతలు రావాలని రోగుల ఆవేదన. కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పడవులు కోసం పైరవీలు చేసే బదులు ఆ ఆసుపత్రికి కావాల్సిన మౌలిక వసతుల గురించి నాయకులు, వ్యాపార వేత్తలు, యువత ఆలోచిస్తే బాగున్ను అని స్థానికులు అనుకుంటున్నారు..

## ప్రతి గ్రామంలోని దేవాలయాలు, మజీద్,చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**రూరల్ సీఐ నాగభూషన్, ఎస్సై శ్రీకాంత్**



**బద్వేల్ మే 15 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్, గోపవరం మండలాలలో గ్రామ పెద్దలతో గురువారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సిఐ నాగభూషణ్ ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా సిఐ నాగభూషణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చే విధంగా గ్రామ పెద్దలు చొరవ తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్నటువంటి దేవాలయాలు, మసీద్ చర్చీలు పబ్లిక్ ప్రాంతాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు, ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామాలకు వచ్చినప్పుడు సీసీ కెమెరాలు రికార్డుల నమోదు అవుతాయని వాటి ద్వారా తెలుసుకోవచ్చన్నారు, కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాలలో పర్యటించి రకరకాల చోరీలకు పాల్పడుతూ ఉన్న సంఘటనలు కూడా కొన్ని ప్రాంతాలలో సంభవించాయని గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి చోరీలు జరగకుండా ఉండాలంటే గ్రామంలో కచ్చితంగా కొన్ని ఏరియాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా గ్రామ పెద్దలు ఏర్పాటు చేసుకోవాలన్నారు, అలాగే గ్రామాలలో ఎక్కడ కూడా ఎటువంటి పేకాట, జూదం, పబ్లిక్ లో మద్యం సేవించడం లాంటివి చేయకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు, గ్రామీణ ప్రాంతాలలో ఏవైనా సమస్యలు సంభవిస్తే వెంటనే పోలీసులు దృష్టికి తీసుకు రావాలన్నారు, అలాగే సైబర్ నేరాలపై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు, అదేవిధంగా వాట్సాప్ గ్రూపులలో ఎటువంటి లింకులు వచ్చిన ఓపెన్ చేయవద్దని సూచించారు, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసులు ఎప్పుడు సేవలు అందించే విధంగా ఉంటారన్నారు, అనంతరం పలు రకాల విషయాలను గ్రామ పెద్దలతో చర్చించారు, పోలీస్ చట్టాల గురించి తెలిపారు, ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది గోపవరం, బద్వేల్ మండలాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో జిల్లాకు ర్యాంకుల పంట

పెద్దపల్లి గత ఏప్రిల్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్ కార్యాలయా లకు, ఉద్యోగులు, జిల్లాలకు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి పూర్వపు జిల్లాల వారిగా ర్యాంకులను ప్రకటించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు అత్యధిక ర్యాంకులు పొందిన పలువురికి ఎస్ ఈ మాధవరావు అభినందనలు తెలిపారు. ఈ విజయం అందరి సమష్టి కృషితోనే సాధ్యమైనదని కంపెనీలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. రూరల్ సెక్షన్ విభాగంలో 1, 2, 3, 4, 5 వ ర్యాంక్స్ ను పెద్దపల్లి జిల్లా సెక్షన్ లు కైవసం చేసుకున్నాయని, వాటిలో కాట్నపల్లి 1 వ, బసంత్ నగర్ 2వ, అంతర్గం 3వ, ఖిలావనపర్తి 4వ ఎలిగేడు 5వ ర్యాంక్స్ ను సాధించినట్లు తెలిపారు. అర్బన్ సెక్షన్స్ లో పెద్దపల్లి టౌన్ 5వ ర్యాంక్ సాధించిందని, సబ్ డివిజన్ రూరల్ విభాగంలో సుల్తానాబాద్ ఏడిఈ శ్రీనివాస్ కి 1వ ర్యాంక్, ధర్మారం ఏడిఈ విజయ్ గోపాల్ సింగ్ కు 5వ ర్యాంక్ దక్కగా, డివిజన్ లలో పెద్దపల్లి డిఈ అదనపు ఇన్చార్జి రవి 1 వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ఏఈ, ఏడిఈ, సబ్ ఇంజనీర్స్, అకౌంట్స్ స్టాఫ్ అందరి కృషితోనే పెద్దపల్లి డివిజన్ డిఈ టెక్నికల్ బి. రవి కి 1 వ ర్యాంక్ వచ్చిందన్నారు. 16 జిల్లాలలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ రావడానికి కృషి చేసిన ప్రతీ ఉద్యోగికి సర్కిల్ తరుపున సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పూర్వపు కరీంనగర్ జిల్లాలో రూరల్ సబ్ డివిజన్ లలో శ్రీరాంపూర్ ఏడిఈ మధుకర్ కు ర్యాంక్ దక్కింది. పూర్వపు కరీంనగర్ జిల్లాలో సబ్ డివిజన్ అర్బన్ లో రామగుండం ఏడిఈ రమేష్ కి ర్యాంక్ దక్కింది. ముమ్మందు అందరూ కష్టపడి పెద్దపల్లి జిల్లాకు ఇంకా మంచి ర్యాంక్ లు తీసుకురావాలని, మన సంస్థను అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్దామని పెద్దపల్లి సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు విద్యుత్ సంస్థ లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని కోరారు. జిల్లాలో ర్యాంకులు సాధించిన అందరికీ పేరు పేరున శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళా సంఘాల ద్వారా వృద్ధాశ్రమం నిర్వహణ

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**70 లక్షల రూపాయలతో వృద్ధాశ్రమం నిర్మాణం**

**పెద్దపల్లి :**మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్దపల్లి జిల్లాలో వృద్ధాశ్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరెట్ లో వృద్ధాశ్రమం నిర్వహణ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళా సంఘాలు పొదుపు తదితర విషయాలే కాకుండా సామాజిక సేవకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమై న విషయమని జిల్లా కలెక్టర్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం 70 లక్షల రూపాయల ఖర్చుతో వృద్ధాశ్రమాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. వృద్ధాశ్ర మంలో నిరాదరణలో ఉన్న 50 వయోవృద్ధులు మందికి ఆశ్రయం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ ఆశ్రమాన్ని నిర్వహించటానికి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు కోరగా అర్హతగల సంస్థలు ఏవీ రాకపోవడంతో జిల్లా మహిళా సమాఖ్య వారికి ఈ బాధ్యత ను అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. వృద్ధాశ్రమాన్ని నిర్వహించడమే కాకుండా సంవత్సరానికి సుమారు ఆరు లక్షలు వృద్ధుల కోసం మహిళా సంఘం ఖర్చు చేయడానికి ముందుకు రావడం వారి సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుందని కలెక్టర్ అన్నారు. అనంతరం వృద్ధాశ్రమం నిర్వహణ విషయమై జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాలరావుతో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్నేహ కార్యదర్శి శోభ, కోశాధికారి స్వప్న అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు లో మంటలు..ప్రయాణికులు సురక్షితం

**యాదాద్రి :** యాదాద్రి జిల్లా బీబీనగర్ వద్ద రైలులో మంటలు చెలరేగాయి. మిర్యాలగూడ నుంచి కాచిగూడ వెళుతున్న రైలు భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి దాటుతుండగా పొగలు అలుముకున్నాయి. గమనించిన ప్రయాణికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బీబీనగర్ రైల్వే స్టేషన్లో రైలును ఆపిన సిబ్బంది ఫైరింజన్ సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి అపాయం జరగలేదన్నారు.

## గులాబీలో కుర్చీలాట

**హైదరాబాద్ :** భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు.2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు.

# గాలి జాతకం అలా అయిపోయిందే..?

**హైదరాబాద్ :** కోట్లు ఉన్నప్పటికీ ప్రయోజనం ఏముంది? జీవితంలో ఎక్కువ భాగం జైలుకే పరిమితమయితే ఇక సంపాదించింది అనుభవించడం కూడా లేని అది దరిద్రమైన జాతకం గాలి జనార్ధన్ రెడ్డిది. అక్రమంగానో.. ఎలాగోనో గాలి జనార్ధన్ రెడ్డి కోట్లాది రూపాయలు కూడబెట్టారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన గాలి కుటుంబం కర్ణాటకు వెళ్లి సెటిలయింది. కర్ణాటకలో అనేక వ్యాపారాలు చేసి కోట్లాది రూపాయలను కూడబెట్టింది. గాలి జనార్ధన్ రెడ్డికి ఎన్ని కోట్ల రూపాయలు ఉన్నాయో ఆయన కుమార్తెకు చేసిన వివాహంలో చేసిన హంగూ ఆర్భాటాలు చూస్తేనే అర్థమవుతుంది. బంగారు పళ్లేలు, నగలు, నట్రా.. ఇలా ఒకటేమిటి.. బంగారంతో పొదిగిన అన్నీ విలువైన వస్తువులు.కాలుకదిపితే ఏ కారు వస్తుందో ఆయనకు కూడా తెలియదు. ఇక ఇంట్లో ఉన్నా బయట ఉన్నా ఏసీల్లోనే గాలి సేదతీరతారు. అలాంటి గాలి జనార్ధన్ రెడ్డి ఇప్పుడు చంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు గాలి జనార్ధన్ రెడ్డితో పాటు మరో నలుగురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. వీరిపై ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానాను కూడా విధించింది. గతంలోనూ కొన్నేళ్ల పాటు గాలి జనార్ధన్ రెడ్డి శిక్ష అనుభవిస్తూ జైలు జీవితం గడిపారు. అయితే ఆ శిక్షను మినహాయించాలని కోరినా న్యాయస్థానం ఒప్పుకోలేదు. దీంతో గాలి జనార్ధన్ రెడ్డి చంచల్ గూడ జైలులో నిందితుడిగా ఉంటూ ఉన్నారుఇంట్లోనే మనం ఉండలేకపోతున్నాం. ఇక బిజినెస్ మాగ్నెట్ అయిన గాలి జనార్ధన్ రెడ్డి జైల్లో ఉక్కపోతకు మగ్గిపోతున్నారట. తనకు జైల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలంటూ గాలి జనార్ధన్ రెడ్డి పిటీషన్ వేశారు. అయితే గాలి పిటీషన్ ప్రస్తుతం రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. ఈ కేసులో విచారించి ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియదు కానీ గాలి జనార్ధన్ రెడ్డి జైలు జీవితం గడపలేకపోతున్నారని అర్థమవుతుంది. తనకు ఇంటి నుంచి భోజనంతో పాటు నిద్రించడానికి బెడ్, ఫ్యాన్ తో పాటు మరికొన్ని సౌకర్యాలు కోరుతున్నారు. పాపం చేసిన గాలికి ఈ శిక్ష సరిపోతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అక్రమాలకు అనుభవించాల్సిందేనంటూ కామెంట్స్ వినపడుతున్నాయి. రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం కూడా లేనట్లే.అందుకు జనార్దన్ రెడ్డి స్పందిస్తూ.. తన వయసును, తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి, శిక్షను తగ్గించాలని కోరారు. ఆయన విన్నపై జడ్జి స్పందిస్తూ..'ఈ కేసులో పదేళ్ల శిక్ష ఎందుకు వేయకూడదు' అని ప్రశ్నించారు. తాను ఇప్పటికే నాలుగేండ్లకు పైగా సామాజిక సేవ చేస్తున్నానని.. బళ్లారితో పాటు గంగావతిలో కూడా ప్రజలు తనను అఖండ మెజారిటీతో గెలిపించారని ఈ సందర్భంగా గాలి జనార్దన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. తన సేవలను గుర్తించినందుకే ప్రజలు గెలిపించారని చెప్పారు. ఆయన వాదనలు విన్న న్యాయస్థానం.. చివరకు ఆయనకు ఏడేళ్ల శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో.. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమ తవ్వకాల కేసు సంచలనం సృష్టించింది. ఏపీ అనంతపురం జిల్లాలోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో అక్రమ తవ్వకాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. సీబీఐ ఈ కేసును విచారించి.. పలువురిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసింది.విచారణలో భాగంగా గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, వీడీ రాజగోపాల్, మెఫజ్ అలీ ఖాన్, ఓఎంసీ కంపెనీని దోషులుగా నిర్ధారించింది. వీరికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధించింది. అలానే ఈ కేసుకలో ఆరోపణలు ఎదుర్కొన్న సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలను నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని హైకోర్టు నిర్దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే.



# నీటి పారుదల శాఖలో కొత్త ఉద్యోగులకు సీఎం రేవంత్ సూచన

**హైదారాబాద్** తెలంగాణలో తరతరాలుగా వాయిదాలు పడుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖలో కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులను ఉద్దేశించి చెప్పారు. తెలంగాణ రైతులు ఆత్మగౌరవంతో బతకడానికి అవసరమైన నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వాములై ప్రజల భావోద్వేగానికి ప్రతీకలుగా నిలబడాలని సూచించారు. కొలువుల పండుగలో భాగంగా నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 244 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, (ఏఇఇ), 199 జూనియర్ టెక్నికల్ ఆఫీసర్స్ (ఝూ) లకు జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్న ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. “గత నలభై యాభై ఏళ్లుగా రావలసిన నీళ్లు రాకపోగా, పూర్తి కావలసిన ప్రాజెక్టులు పూర్తి కాని కారణంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, వాయిదా పడుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. నీళ్లు ఎంత అవసరమో అందుకు ఎంతగా పరితపించామో, ఏ నీటి కోసమైతే పోరాటం మొదలైందో ఆ నీళ్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టాయి. అందుకే నీటి పారుదల శాఖకు ప్రభుత్వం అంత ప్రాధాన్యత ఇస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగైదు దశాబ్దాలు వాయిదా పడిన ప్రాజెక్టులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లలో కూడా పూర్తి కాలేదు. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభమైన ప్రాజెక్టులు తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో ఏదీ పూర్తి కాలేదు. ఈనాటికీ వాయిదాలు పడుతూనే ఉన్నాయి. తెలంగాణ ప్రజలకు అతిపెద్ద సెంటిమెంట్ నీళ్లు. ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యత కింద పూర్తి చేస్తాం. ఇంజనీర్లుగా మీరు చేపట్టే



ప్రాజెక్టులు భవిష్యత్తు తరాలకు అందించాల్సిన భాధ్యత ఉంది. ఇది నెలనెలా జీతం తీసుకునే ఉద్యోగంగా కాకుండా ఒక బాధ్యతగా, ప్రజల భావోద్వేగంగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములై రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. పదేళ్లుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. గత సెప్టెంబర్ లో ఇదే వేదిక నుంచి 738 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, జూనియర్ అసిస్టెంట్లకు నియామాక పత్రాలు అందించి భుజం తట్టాం. మళ్లీ ఈరోజు 443 ఉద్యోగాలను నియమించాం. 14 నెలల కాలంలో ఈ ఒక్క శాఖలోనే 1121 మందిని నియమించామంటే ఈ శాఖకు ఇస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లు, ప్రత్యేక తెలంగాణలో పదేళ్లు నోటిఫికేషన్ల కోసం కొట్లాడాం. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత ఉద్యోగ నియామకాలు. 14 నెలల్లో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించాం. 3 లక్షల కోట్ల రూపాయల మేరకు పెట్టుబడులను తీసుకొచ్చాం. యువతకు విద్య, ఉద్యోగాల కల్పన ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. అడ్డంకులను అధిగమించి తొందరలోనే గ్రూప్ ఎ, ఎఎ, ఎఎఎ, ఎఎ నియామకాలు పూర్తి చేస్తాం...” అని ముఖ్యమంత్రి గారు ఉద్యోగులను ఉద్దేశించి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, , పొన్నం ప్రభాకర్, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో పాటు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రంప్ టవర్స్‌కు ఎసరు

**హైదరాబాద్ :** హైదరాబాద్ రియాల్ ఎస్టేట్ మార్కెట్‌లో గ్లోబల్ బ్రాండ్‌గా పేరొందిన ట్రంప్ రియాల్టీ సంస్థ కోకాపేటలో అత్యంత విలాసవంతమైన టవర్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాకముందే స్థల యాజమాన్య వివాదంలో చిక్కుకుంది. ఈ వివాదం ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భారతదేశంలో ఇప్పటికే ముంబై, కోల్‌కతా, గుర్‌గావ్, పుణెలలో విలాసవంతమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లను విజయవంతంగా నిర్మించింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని కోకాపేట గోల్డెన్ మైల్ ప్రాంతంలో రూ3,500 కోట్ల విలువైన ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో మూడు టవర్లు, 66 అంతస్తులు, 243 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్ట్‌కు భారతీయ భాగస్వామిగా ఐరా రియాల్టీని ఎంచుకున్నారు. కోకాపేటలోని గోల్డెన్ మైల్ ప్రాంతంలో ఐరా రియాల్టీకి చెందిన స్థలంలో ఈ టవర్ల నిర్మాణం జరగనుంది. అనుమతుల ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు ప్రచారం జరిగింది, మరియు ఈ ఏడాది చివరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ఈ భారీ ప్రాజెక్ట్ మొదలు కాకముందే స్థల యాజమాన్య వివాదం తలెత్తింది. నాందెల రామ్‌రెడ్డి అనే వ్యక్తి తాను కూడా ఈ స్థలంలో సహ యజమాని అని, తనకు తెలియకుండానే ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రకటనలు జరిగాయని ఆరోపిస్తూ బహిరంగ లీగల్ నోటీసు జారీ చేశారు. రామ్‌రెడ్డి తరపు న్యాయవాది జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, గోల్డెన్ మైల్ ప్రాంతంలోని 12,602 గజాల స్థలంలో రామ్‌రెడ్డికి 425 గజాల వాటా ఉంది. ఈ స్థలాన్ని ఐరా రియాల్టీతోపాటు పది మందికి పైగా వ్యక్తులు కలిసి కొనుగోలు చేశారని, అందులో రామ్‌రెడ్డి ఒకరని వారు పేర్కొన్నారు.రామ్‌రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా ఈ స్థలంపై ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం తన హక్కులను కాలరాసినట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో తాను ఊరుకునేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.ఈ స్థల యాజమాన్య వివాదం ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి చట్టపరమైన సమస్యలు పరిష్కారం కాకపోతే, ప్రాజెక్ట్ ఆలస్యం కావచ్చు లేదా పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉంది. గతంలో కూడా హైదరాబాద్‌లోని కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లు స్థల వివాదాల కారణంగా ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ఐరా రియాల్టీ, ట్రంప్ ఆర్గనైజేషన్ ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తాయనేది ఇప్పుడు కీలకం. ఒకవేళ రామ్‌రెడ్డితో చర్చలు జరిపి, ఆయన వాటాను కొనుగోలు చేయడం లేదా ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించగలిగితే, ప్రాజెక్ట్ పురోగతిలోకి వెళ్లే అవకాశం ఉంది. అలా కాకపోతే, ఈ వివాదం చట్టపరమైన పోరాటంగా మారి, ప్రాజెక్ట్‌ను వెనక్కి నెట్టవచ్చు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ గత కొన్నేళ్లుగా వేగంగా వృద్ధి చెందుతోంది. కోకాపేట, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాలు విలాసవంతమైన నివాస ప్రాజెక్ట్‌లకు కేంద్రంగా మారాయి. ట్రంప్ టవర్స్ వంటి గ్లోబల్ బ్రాండ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అయితే, స్థల వివాదాలు వంటి సమస్యలు ఈ అవకాశాలను అడ్డుకోవచ్చు. రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ వివాదం ఇతర డెవలపర్లకు కూడా ఒక హెచ్చరికగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. స్థల కొనుగోళ్లలో సహ యజమానులతో స్పష్టమైన ఒప్పందాలు, అనుమతులు, మరియు చట్టపరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ ఘటన తెలియజేస్తోంది.

# మామిడి పళ్లతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు



మామిడి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. చర్మ కణాలు దెబ్బతినకుండా నివారిస్తుంది. మామిడి పండ్లలో ఉండే ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయ పడుతుంది. పండ్లలో రారాజు మామిడి.. వేసవి కోసం అందరూ ఎదురు చూసేది మామిడి పండ్ల కోసమే అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. సమ్మర్ స్పెషల్ మామిడి పండ్లు కేవలం రుచికరంగా ఉండటమే కాకుండా శరీరానికి కూడా అనేక ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. మామిడి పండ్ల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. మామిడి పండ్లతో జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. మామిడి పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది ఉబ్బరం, మలబద్ధకం, అజీర్ణం వంటి జీర్ణ రుగ్మతల నుండి ఉపశమనం కలిగిస్తుంది. మామిడి పండ్లు తినటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సీజన్ వ్యాధులు దరిచేరకుండా శరీరానికి మంచి ఇమ్యూనిటి పవర్‌లా పనిచేస్తుంది. మామిడి పండ్లలో ఉండే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచి ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి. గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. మామిడి పండ్లలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడానికి మరియు ఆరోగ్యకరమైన హృదయనాళ వ్యవస్థకు తోడ్పడతాయి. అంతేకాదు.. మామిడి పండ్లలో విటమిన్ ఎ ఉంటుంది. ఇది కంటి చూపుకు మేలు చేస్తుంది. మంచి దృష్టికి విటమిన్ ఎ అవసరం. వయస్సు సంబంధిత కంటి వ్యాధులను నివారించడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. మామిడి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. చర్మ కణాలు దెబ్బతినకుండా నివారిస్తుంది. మామిడి పండ్లలో ఉండే ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయ పడుతుంది. అయితే, మామిడి పండ్లను ఎల్లప్పుడూ మితంగా తినాలి.

# కంటి ఆరోగ్యం కోసం ఖచ్చితంగా ఈ పండ్లు తినాల్సిందే



కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. కొన్ని ప్రత్యేకమైన పండ్లు జుట్టు, చర్మం వంటి వాటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు కంటి చూపును కూడా మెరుగుపరుస్తాయి. కంటి సమస్యలను తగ్గించుకోవడానికి సహాయపడే పండ్లను తీసుకోవడం ద్వారా మీరు మీ కంటి ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చు. మామిడి పండ్లలో ఉండే బీటా కెరోటిన్ వల్ల అది శరీరంలో విటమిన్ ఏగా మారుతుంది. విటమిన్ ఏ కంటి ఆరోగ్యానికి ఎంతో అవసరం. దీని వల్ల కంటి వెలుగు మెరుగుపడుతుంది. మామిడి పండ్లు తింటే రేచీకటి సమస్యలు, కంటి కురులు తగ్గిపోతాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని పెంచేందుకు సహాయపడతాయి.బొప్పాయిలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, విటమిన్ ఇ, బీటా కెరోటిన్ కంటి ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయి. ఈ పండ్లు కంటి కీళ్లను కాపాడే ప్రక్రియలను ప్రోత్సహిస్తాయి. బొప్పాయి తినడం వల్ల కంటి సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. అలాగే కంటి వెలుగును పెంచడంలో కూడా సహాయపడతాయి. కివీలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఈ విటమిన్ కంటిలోని రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. కివీ పండ్లు కంటిలోని రక్త ప్రసరణను పెంచి.. కంటి సమస్యలు దూరం చేయడంలో సహాయపడతాయి. కివీ తినడం ద్వారా కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.నేరేడు పండ్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ పండ్లు కంటి సంబంధిత సమస్యలను తగ్గించడంలో, దృష్టి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి.పుచ్చకాయలు అధికంగా నీటిని కలిగి ఉంటాయి. ఈ పండ్లు కంటిని హైడ్రేటెడ్‌గా ఉంచటంలో కీలకమైనవి. పుచ్చకాయలు తింటే కంటి సమస్యలు తగ్గిపోతాయి. ఇవి పొడి కన్నుల సమస్యను తగ్గించడంలో కూడా సహాయపడతాయి.అరటి పండ్లలో విటమిన్ ఏ, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. అరటి పండ్లు కంటి న్యూట్రియంట్స్‌ని పునరుద్ధరించడంలో సహాయపడతాయి. ఇవి కంటి సంబంధిత సమస్యలను కూడా తగ్గిస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ రుచికరమైన పండు.. ఇది విటమిన్ సి పుష్కలంగా కలిగి ఉంటుంది. ఈ పండులోని పోషకాలు కంటి ఆరోగ్యాన్ని పటిష్టం చేస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల కంటి వెలుగు పెరిగి కంటి సమస్యలు తగ్గిపోతాయి. సీతాఫలం ఎంతో రుచికరమైన పండు. ఇందులో విటమిన్ బి, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. సీతాఫలం కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించే పోషకాలను అందిస్తుంది.సిట్రస్ పండ్లు కూడా కంటి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైనవి. నారింజ, నిమ్మ, జామ, ద్రాక్ష వంటి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఈ పండ్లు కంటి కీళ్లను కాపాడటంలో, దృష్టి సమస్యలు తగ్గించడంలో సహాయపడతాయి. సిట్రస్ పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు కంటిని ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి ఆరోగ్యం నిరంతరం కాపాడుకోవాలి. అందుకు సరైన ఆహారం, ముఖ్యంగా పండ్లు తీసుకోవడం చాలా అవసరం. మామిడి, బొప్పాయి, కివీ, నేరేడు, పుచ్చకాయలు వంటి పండ్లను ఆహారంలో చేర్చుకుంటే కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. ఈ పండ్లను ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా కంటి సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి.

# ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని తింటున్నారా..?



ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని వండేటప్పుడు ఆరోగ్యకరమైన ఆహారం కోసం కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఫ్రిజ్‌లో ఉంచిన మాంసం బయటకు తీసినప్పుడు కొన్నిసార్లు చల్లదనం కోల్పోతుంది. బాగా చల్లగా ఉన్న మాంసం బయట వేడి వాతావరణంలోకి వచ్చినప్పుడు బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఈ కారణంగా అది విషపూరితం అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ఫ్రిజ్‌లో నుండి తీసిన మాంసాన్ని ఎక్కువ సమయం వృథా చేయకుండా వెంటనే వండాలి లేదా తిరిగి ఫ్రిజ్ లోనే ఉంచాలి. ఫ్రిజ్ నుండి తీసిన మాంసాన్ని సరైన ఉష్ణోగ్రతలో ఉంచకపోతే.. అందులోని బ్యాక్టీరియా అనుకూల పరిస్థితుల్లో వేగంగా పెరుగుతుంది. చూడటానికి మాంసం తాజాగా అనిపించినప్పటికీ అది విషపూరితమయ్యే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి మాంసాన్ని తరచుగా వేడిగా లేదా చల్లగా ఉంచడం చాలా ముఖ్యం.ఫ్రిజ్ నుండి మాంసాన్ని బయటకు తీసినప్పుడు, దాని పైభాగం త్వరగా చల్లదనాన్ని కోల్పోతుంది.. అయితే లోపలి భాగం ఎక్కువసేపు చల్లగా ఉంటుంది. ఇది వండే సమయంలో రుచిలో మార్పులకు దారితీయవచ్చు. దీనివల్ల కొన్ని భాగాలు బాగా ఉడికి మరికొన్ని భాగాలు సరిగా ఉడకకపోవచ్చు.ఫ్రిజ్‌లో ఉంచిన మాంసాన్ని వండేటప్పుడు ఒకేసారి అధిక వేడితో కాకుండా.. అన్ని భాగాలు పూర్తిగా ఉడికేలా చూడాలి. మాంసం సరిగ్గా ఉడకడానికి ముందుగా ఉష్ణోగ్రతను క్రమంగా పెంచాలి.ఫ్రిజ్‌లో మాంసం నిర్దిష్ట ఉష్ణోగ్రత వద్ద ఉండాలి. సాధారణంగా 4 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలో ఉంచడం ఉత్తమం. ఈ ఉష్ణోగ్రత బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తుంది. ఫ్రిజ్‌లో మాంసాన్ని కింద ఉండే అరలో ఉంచడం వల్ల అది ఎక్కువసేపు చల్లగా ఉంటుంది. ఫ్రిజ్ నుండి మాంసాన్ని తీసిన తర్వాత కాసేపు చల్లటి నీటిలో ఉంచడం మంచిది. ఈ ప్రక్రియ మాంసం చల్లగా ఉండటానికి, బ్యాక్టీరియా పెరిగే అవకాశాలను తగ్గించడానికి సహాయపడుతుంది. నీటిలో ఉంచిన తర్వాత దానిని వేడి లేదా చల్లగా ఉంచి వండటానికి ఉపయోగించవచ్చు. ఫ్రిజ్‌లో పెట్టిన మాంసాన్ని ఎక్కువ రోజులు ఉంచితే పాడైపోతుంది. కాబట్టి వాడే ముందు అది మంచిగా ఉందో లేదో బాగా చూసుకోవాలి. ఏమైనా తేడా అనిపిస్తే తినకూడదు. ఫ్రిజ్‌లో పెట్టిన మాంసాన్ని వండేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుపెట్టుకుంటే ఆరోగ్యం పాడవకుండా ఉంటుంది. మాంసంలో బ్యాక్టీరియా తొందరగా పెరుగుతుంది, దానివల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ఛాన్స్ ఉంది, రుచి కూడా మారిపోతుంది. అందుకే మాంసాన్ని సరైన చల్లదనంలో ఉంచాలి, బాగా ఉడికించాలి. ఇలా చేస్తేనే మంచిగా, రుచిగా ఉంటుంది.

### పరగడుపున మునగాకు నీటిని తాగితే..

# ఊహించని ప్రయోజనాలు..!



మునగాకు లో విటమిన్లు ఎ, సి, ఇ, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. మునగాకు నీళు ్ళ రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. విటమిన్ సి సమృద్ధిగా ఉండే మునగాకు నీళ్ళు జలుబు, దగ్గు, జ్వరం నుండి ఉపశమనం కలిగిస్తుంది. మునగాకు నీళ్ళు తాగడం వల్ల జీవక్రియ పెరిగి, ఆకలి తగ్గి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మునగ చెట్టులో ఎవరూ ఊహించని ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకే ఆయుర్వేదంలో మునగాను అనేక చికిత్సలకు ఔషధంగా ఉపయోగిస్తుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. మునగను పోషకాహార శక్తి కేంద్రంగా చెబుతారు.మునగాకు, కాయల వాడకంతో రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువును నియంత్రిస్తుంది. పోషకాలతో నిండిన మునగాకు నీళ్ళు రోజు తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం.. మునగాకు లో విటమిన్లు ఎ, సి, ఇ, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. మునగాకు నీళ్ళు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. విటమిన్ సి సమృద్ధిగా ఉండే మునగాకు నీళ్ళు జలుబు, దగ్గు, జ్వరం నుండి ఉపశమనం కలిగిస్తుంది. మునగాకు నీళ్ళు తాగడం వల్ల జీవక్రియ పెరిగి, ఆకలి తగ్గి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మలబద్ధకం, విరేచనాలు, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో మునగాకు నీళ్ళు సహాయపడుతాయి. మునగాకు నీళ్ళలో ఐసోథియోసైనేట్లు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. పాలీఫెనాల్, టానిన్లు, సాపోనిన్లు వంటివి మునగాకులో ఉంటాయి. రక్తపోటును తగ్గించడంలో సహాయపడే సమ్మేళనాలు మునగాకులో ఉంటాయి.

# రాగిజావ రోజూ తాగుతున్నారా..?



ప్రతిరోజూ రాగిజావను తీసుకోవచ్చు. అయితే దీనికంటూ ఓ టైమ్ ఫిక్స్ చేసుకోవాలి. ఎప్పుడుపడితే అప్పుడు తాగటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. రాగి జావను ఉదయం తీసుకుంటే చాలా మంచిది. కానీ రాత్రిపూట తీసుకోవడం మంచిది కాదని సూచిస్తున్నారు. అలాగే, మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్ర విసర్జన సమస్యలు ఉన్నవారు కూడా దీనికి దూరంగా ఉంటే మంచిదని అంటున్నారు. రోజూ రాగిజావ తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. మంచి పోషకాలను కలిగి ఉంటుంది. విటమిన్లు, మినరల్స్, కార్బోహైడ్రేట్‌లు, ఫైబర్‌లు, కొవ్వులు, ప్రొటీన్‌ల వంటి అన్ని అవసరమైన స్థూలపోషకాలను కలిగి ఉంటుంది. ప్రతిరోజూ రాగిజావను తీసుకోవచ్చు. అయితే దీనికంటూ ఓ టైమ్ ఫిక్స్ చేసుకోవాలి. ఎప్పుడుపడితే అప్పుడు తాగటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. రాగి జావను ఉదయం తీసుకుంటే చాలా మంచిది. కానీ రాత్రిపూట తీసుకోవడం మంచిది కాదని సూచిస్తున్నారు.ఇక మూత్రపిండాల్లో రాళు ్ల లేదా మూత్ర విసర్జన సమస్యలు ఉన్నవారు రాగిజావకు దూరంగా ఉంటేనే మంచిది. బరువు పెరగాలనుకునేవారు రాగి జావను ఎక్కువగా తీసుకోవద్దు. కొంచెంగా తీసుకోవచ్చు. ఎందుకంటే రాగజావ వినియోగంతో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. రాగి జావ అధిక వినియోగం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, డయేరియా వచ్చే అవకాశముంది. కొందరికి దీని వల్ల కొందరిలో అలర్జీ వంటివి కూడా రావొచ్చు. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు రాగులు తినకపోవటం మంచిది. రాగిలో థైరాయిడ్ గ్రంథి సాధారణ పనితీరుకు ఆటంకం కలిగించే గోయిట్రోజెన్‌లతో నిండి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, రాగి జావ ఎక్కువగా తీసుకోవటం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, డయేరియా వంటి సమస్యలు వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

# ఆర్డీటీ కోసం గ్రామ స్థాయిలో పోరాటాలకు సిద్ధమౌదాం

**అఖిలపక్ష కమిటీ జేఏసీ కన్వీనర్ సాకే హరి**

**అనంతపురం మే 15** ఆర్డీటీ అడ్డంకులు తొలగి పోవాలంటే గ్రామ స్థాయిలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని అఖిలపక్ష కమిటీ జేఏసీ కన్వీనర్ సాకే హరి అన్నారు. ఆర్డీటీకి విదేశాల నుండి వస్తున్న నిధులను కేంద్ర ప్రభుత్వం ఆపడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం బత్తలపల్లి మండల కేంద్రంలోని ఆర్డీటీ అస్పత్రి ముందు అఖిలపక్ష కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్డీటీ ని కాపాడుకుందామని చైతన్య కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్బంగా సాకే హరి మాట్లాడుతూ.. బత్తలపల్లి,కణేకల్, కళ్యాణదుర్గం లాంటి ప్రాంతాల్లో కొట్లాది రూపాయలతో అస్పత్రి భవనాలు నిర్మించి లక్షలాది మంది పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన ఘనత ఆర్డీటీదన్నారు. ఆర్టీటీ గొప్ప లక్ష్యంతో ఏర్పడిందని సేవా, సహాయ దృక్పథంలో అనేకమంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. ముఖ్యంగా విద్యా,వైద్యానికి పెద్దపీట వేస్తూ పేదలను ఆదుకోవడంలో గొప్పగా కృషిచేసిన ఆర్టీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ను ఎప్పటికీ పేద ప్రజలు మర్చిపోలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులను ఆపకుండా చూడాలని ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ వెంటనే అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి




ధ్యేయంగా ఏర్పడితే పట్టణ,నగర ప్రాంతాల్లో కూడా తీసిపోకుండా అభివృద్ధి పరచడం గొప్ప విషయమన్నారు. ఆర్టీటీపై కేంద్ర ప్రభుత్వ ఆంక్షలు,అడ్డంకులు తొలగి పోవాలంటే కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ఢిల్లీ పేదలకు సాయం చేస్తున్న ఆర్టీటీకు పెద్దల ముప్పు పొంచి ఉన్నదని మతం రంగు పులిమి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయకపోవడం దారుణమన్నారు. ఆర్డీటీని కాపాడుకోవడానికి సమిష్టిగా ఉద్యమాలు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల పక్ష కమిటీ నాయకులు సుగామంచి శ్రీనివాసులు. సిగిలిరేవు రామాంజనేయులు. రామకృష్ణ. రాకెట్ల సూర్య నారాయణ. అసాది హరి. కుమార్. గంగాధర్ అస్పత్రికి వచ్చిన వారు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు ప్రాంతంలో రికార్డ్ స్థాయిలో వర్షపాతం నమోదు**
**పలు ప్రాంతాల్లోకి వరద నీరు**
**సహాయక చర్యలను ఫోన్ ద్వారా పర్యవేక్షించిన ఎమ్మెల్యే సునీత**

**అనంతపురం మే 15** అనంతపురం రూరల్ ప్రాంతం తో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పలు కాలనీల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ ప్రజాశక్తి నగర్, సిపిఎం కాలనీ, బిజెపి కాలనీ అలాగే రాప్తాడు మండల పరిధిలోని కందుకూరు గ్రామ సమీపంలో ఉన్న సిపిఐ కాలనీలో నీరు పెద్ద ఎత్తున చేరింది. శిల్ప లేపాక్షి నగర్ లోనూ నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత అధికార యంత్రంగాన్ని అప్రమత్తం చేశారు. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సూచనలు చేశారు. అనంతరం వారికి ఇళ్లలో నిత్యవసరాలు తడిచిపోవడంతో ఉదయం, మధ్యాహ్నం అల్పాహారం, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కాలనీల్లోకి వచ్చిన నీరుని వంకల్లోకి మరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఎక్కడ ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మధ్యాహ్న సమయానికి కాలనీల్లో నీరు పూర్తిగా తగ్గేలా చూసారు. వరదనీటి కారణంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. మరోవైపు రాప్తాడు జాతీయ రహదారి నుంచి కందుకూరుకు వెళ్లే మార్గంలో సీపీఐ కాలనీలోకి నీరు రావడం పట్ల కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ కల్వర్టును నిర్మిస్తే ఈ సమస్య ఉండదని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆమె ఈ విషయాన్ని కలెక్టర్ కు వివరించారు. కల్వర్టు మంజూరు చేయాలని విజ్ఞప్తి దీనిపట్ల కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారు.....



# విజేత అనంత రైజింగ్ స్టార్స్







**అర్ధ సెంచరీతో చెలరేగిన ప్రశాంత్ కుమార్**
**ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రశాంత్ కుమార్**

**అనంతపురం మే 15:** చంద్రమోహన్ మెమోరియల్ ట్రోఫీ 2025 విజేతగా అనంత రైజింగ్ స్టార్స్ నిలిచింది హెూరాహెూరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో కదిరి పై అనంత రైజింగ్ స్టార్స్ 20 పరుగులతో విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్ లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా అనంత రైజింగ్ స్టార్స్ ప్లేయర్ ప్రశాంత్ (79) నిలిచాడు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న చంద్రమోహన్ మెమోరియల్ టీ20 లీగ్ ఫైనల్ మ్యాచ్ ఆర్డిటి క్రీడా మైదానంలో గురువారం మధ్యాహ్నం జరిగింది టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంత రైజింగ్ స్టార్స్ నిర్ణీత 20 ఓవర్లలో 190/8 పరుగులకు చేశారు అనంత రైజింగ్ స్టార్స్ జట్టులో ప్రశాంత్ (79) తనదైన శైలిలో చక్కటి బ్యాటింగ్ చేసి జట్టుకు భారీ స్కోరును అందించాడు తేజ రెడ్డి 39, దినకర్ 21, రోహిత్ 17 పరుగులు తీశారు. కదిరి బౌలర్లు తేజ 3, భాను 2, వెంకట సాయి ఒక వికెట్ తీసుకున్నారు. కదిరి జట్టు 191 పరుగుల లక్ష్యాన్ని చేధించలేక పోయింది 20 ఓవర్లలో 171/8 పరుగులు చేసి 20 పరుగుల తేడాతో ఓటమి చెందింది కదిరి జట్టులో గిరీనాథ్ రెడ్డి 42, మొహ్మద్ సోను 34, వెంకట్ సాయి 30, నిశ్చయ 21 పరుగులు చేశారు. అనంత రైజింగ్ స్టార్స్ బౌలర్లు దత్తా రెడ్డి 2, దినాకర్, భార్గవ్, ప్రదీప్ రెడ్డి, మెట్టల భార్గవ్ ఒక్కొక్క వికెట్ తీసుకున్నారు. విజేతలకు చంద్రమోహన్ కుటుంబ సభ్యులు విన్నర్స్, రన్నర్స్ ట్రోఫీలను అందజేశారు ఈ కార్యక్రమంలో వెట్రాన్స్ క్రికెటర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ రామలింగారెడ్డి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి కార్యదర్శి భీమ లింగారెడ్డి కమలాకర్ నాయుడు సిరి నిరంజన్ సీతారామారావు ప్రసాద్ రెడ్డి షాబుద్దీన్ విజయరాజు ప్రసన్న యుగంధర్ రెడ్డి గులాం ఖాదిర్ భాష మదన్ శ్రీనివాస్ రెడ్డి చంద్రమోహన్ రెడ్డి సర్దార్ శర్మాస్ వలి తదితరులు పాల్గొన్నారు

# కాటన్ దొర కి పూలమాలతో ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే వేగుళ్ళ

**అపర భగీరధుడు సర్ అర్ధర్ కాటన్...**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 15:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాలు దేశానికే అన్నపూర్ణగా పేరుతెచ్చిన ఘనత సర్ అర్ధర్ కాటన్ కే దక్కుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. సర్ అర్ధర్ కాటన్ జయంతి వేడుకలను మండపేట బైపాస్ రోడ్డు లో వల్లూరి పాపారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిధిగా పాల్గొని కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్బంగా వేగుళ్ళ మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి తో అతలాకుతలమవుతున్న గోదావరి ప్రాంతాన్ని ధాన్యాగారంగా మార్చిన ఘనుడు కాటన్ అని అన్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించి గోదావరి వాసుల మదిలో అజరామరంగా నిలిచి పోయారన్నారు. ఆరోజుల్లో ఆయన




చేతి కర్రతో గీచిన గీతలు డెల్టా కాలువలయ్యాయి అన్నారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి గోదావరి జిల్లాలకు పునర్జీవం ప్రసాదించిన అపర భగీరధుడుగా కాటన్ చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మండపేట మండల అధ్యక్షులు యరగతపు బాబ్జి, కాటా గోపి, చుండ్రు అగస్త్యరాజు, వల్లూరి వీరవెంకట సత్యనారాయణ, వల్లూరి సత్యనారాయణ, మెర్ల అబ్బు, రెడ్డి భాస్కరరావు, పుల్లేటికుర్తి ఆనంద్, యరమాటి సత్యనారాయణ, యార్లగడ్డ శ్రీనివాస్, వల్లూరి విజయగోపాల కృష్ణ, తదితర్లు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ ఎన్ఆర్ఐ గ్లోబల్ కనెక్ట్ పర్యటనకు ఆక్లాండ్ లో ఘన స్వాగతం



వైఎస్సార్సీపీ ఎన్ఆర్ఐ విభాగ గ్లోబల్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి గారు నేడు న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు వైఎస్సార్సీపీ న్యూజిలాండ్ కన్వీనర్ బుజ్జిబాబు నెల్లూరు, కో-కన్వీనర్లు ఆనంద్ ఎద్దుల, సమంత్ దేగపూడి గార్ల నేతృత్వంలో న్యూజిలాండ్ టీం ఘన స్వాగతం పలికింది. ఈ పర్యటనలో భాగంగా మే 17న ఆక్లాండ్ లో గ్లోబల్ కనెక్ట్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ మీటింగ్ లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు చేసిన ప్రజా పాలనా తత్వాన్ని, అభివృద్ధి విజయాలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లే దిశగా చర్చించనున్నట్టు ఆలూరు సాంబశివా రెడ్డి తెలిపారు.


## అనంతలో17న తిరంగా ర్యాలీ..

**హాజరుకానున్న మంత్రి నారా లోకేష్‌లి**
**ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో తిరంగా ర్యాలీ**
**కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు**



**అనంతపురం మే 15** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 17వ తేదీన నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. 17వ తేదీ ఉదయం 7.30 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ నుండి టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు జరగనుందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వ పటిమ, సాయుధ దళాల పరాక్రమాన్ని ప్రజలకు వివరించేలా ఇది కొనసాగనుందన్నారు. మన దేశ సమైక్యతను అలాగే ఆర్మీకి మన మద్దతు తెలిపే విధంగా ఈ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, మాజీ సైనికులతో పాటు అన్ని వర్గాల వారు హాజరుకావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు.

## నారా లోకేష్ కి ఘన స్వాగతం



**అనంతపురం మే 15** లిఅనంతపురం జిల్లా మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం 1:20 గంటలకు గుత్తి మండలం బేతాపల్లి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ కు చేరుకున్న గౌరవ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ మంత్రి నారా లోకేష్ కి ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, , జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంతకల్ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

## ఘన నివాళి

**ఘనంగా చంద్రమోహన్ 56వ జయంతి వేడుకలు**

**అనంతపురం మే 15:** సీనియర్ క్రికెటర్ స్వర్గీయులు చంద్రమోహన్ 56వ జయంతి వేడుకలను అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఘనంగా నిర్వహించింది చంద్రమోహన్ కుటుంబ సభ్యులు, ఎడిసిఎ కార్యవర్గ సభ్యులు, సీనియర్ క్రికెటర్లు చంద్రమోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రమోహన్ అనంతపురం జిల్లా క్రికెట్ కు నిస్వార్థంగా సేవలు అందిచారు అని కొనియాడారు. క్రికెట్ ఉన్నంత కాలం చంద్రమోహన్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. చంద్రమోహన్ జయంతి వేడుకల్లో జిల్లా వ్యాప్తంగా వున్న సీనియర్ క్రికెటర్లు పాల్గన్నారు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ మచ్చ రామలింగారెడ్డి జిల్లా కార్యదర్శి భీమ్లింగారెడ్డి కమలాకర్ నాయుడు విజయరాజు ప్రసాద్ రెడ్డి వెంకటేశులు మురళి జాయింట్ సెక్రటరీ నజీర్ శర్మాస్ వలిజోషి నరేష్ ప్రసన్న తదితర సీనియర్ క్రికెటర్లు పాల్గొని ప్రసంగించారు అంతకుముందు చంద్రమోహన్ కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి క్రికెటర్లకు పంపిణీ చేశారు

బిజినెస్

## వడ్డీ రేట్ల తగ్గింపు అనివార్యం..!



రుణ గ్రహీతలపై హెచ్చు వడ్డీ రేట్ల భారాన్ని తగ్గించడానికి సమయం అసన్నమయ్యింది. ఇటీవల కాలంలో ద్రవ్యోల్బణం సూచీ తగ్గుముఖం పట్టడంతో వడ్డీ రేట్లకు కోత పెట్టడానికి వీలుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఆరేళ్ల కనిష్టానికి పడిపోయింది. సాధారణంగా అల్ప స్థాయిలో ద్రవ్యోల్బణం, తక్కువ వడ్డీ రేట్లు జిడిపి వృద్ధికి మద్దతును అందిస్తాయి. దీంతో ప్రజల వద్ద ఆదాయాలు పెరగడంతో కొనుగోళ్లకు మద్దతు లభించనుంది. ఈ నేపథ్యంలో వడ్డీ రేట్ల తగ్గింపు అనివార్యమని నిపుణులు సూచిస్తున్నారు. బుధవారం కేంద్ర గణంకాల శాఖ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఏప్రిల్‌లో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.16 శాతానికి దిగివచ్చింది. ఇది 2019 జులై నాటి కనిష్ట స్థాయి. మరోవైపు టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) తగ్గింది. గడిచిన ఏప్రిల్‌లో డబ్ల్యుపిఐ 0.85 శాతానికి పరిమితమై 13 నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం నెలలో ఇది 2.05 శాతంగా చోటు చేసుకుంది. ముఖ్యంగా అహార ఉత్పత్తుల ధరలు దిగిరావడమే ఇందుకు కారణం. మార్చిలో 4.66 శాతంగా ఉన్న అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం, ఏప్రిల్‌లో 2.55 శాతానికి తగ్గింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 3.07 శాతం నుంచి 2.62 శాతానికి దిగివచ్చింది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం ఏకంగా 0.20 శాతం నుంచి మైనస్ 2.18 శాతానికి పడిపోవడం విశేషం. ద్రవ్యోల్బణం ఆధారంగానే ఆర్‌బిఐ వడ్డీ రేట్లలో మార్పులు చేస్తుంది. రిటైల్, టోకు ద్రవ్యోల్బణం దిగిరావడంతో ఆర్‌బిఐ ఎంపిసి ద్రవ్య సమీక్షల్లో రెపోరేటు మరింత దిగిరానుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును పావు శాతం లేదా 25 బేసిస్ పాయింట్లు చొప్పున మొత్తం అర శాతం తగ్గించింది. ఫలితంగా ఎట్టకేలకు రెపో రేటు 6 శాతానికి దిగివచ్చింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినందున రిజర్వు బ్యాంక్ వడ్డీ రేట్లను భారీగా తగ్గించడానికి వీలుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రీసెర్చ్ ఇటీవల పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 3 శాతం దిగువకు తగ్గొచ్చని తెలిపింది. ఇదే పరిస్థితి కొనసాగితే వడ్డీ రేట్లను 125 బేసిస్ పాయింట్లు (1.25 శాతం) తగ్గించడానికి వీలుందని పేర్కొంది. జూన్-ఆగస్టు సమయంలో 75 బేసిస్ పాయింట్లు వడ్డీ రేట్ల తగ్గింపును అంచనా వేస్తున్నాము. ద్వితీయార్థంలో మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గించడానికి వీలుందని పేర్కొంది.

## మైక్రోసాఫ్ట్‌లో 6వేల మందికి ఎసరు




ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వేలాది మంది ఉద్యోగులపై వేటు వేయడానికి సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో దాదాపు 6,000 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. 2023లో 10,000 మందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. మైక్రోసాఫ్ట్‌లో 2024 జూన్ నాటికి 2.28 లక్షల మంది సిబ్బంది పని చేస్తోన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కూడా పనితీరు ఆధారంగా పలువురు ఉద్యోగులను సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూనే ఉంటామని మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని తెలుస్తోంది.

## స్వల్పంగా దిగి వచ్చిన పసిడి..

# అదే బాటలో వెండి





భారతీయులకు బంగారం కొనుగోలు చేయడం భలే ఇష్టం. ఈ ఇష్టంతోనే ఎటువంటి సందర్భం వచ్చినా సరే వెంటనే బంగారం నగలు కొనుగోలు చేయడనికి ఆసక్తిని చూపిస్తారు. అందుకనే ప్రతి సంవత్సరం టన్నులకు టన్నుల బంగారం మన దేశం దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్ లో పరిస్థితి ఆధారంగా దేశీయంగా కూడా పసిడి వెండి ధరలపై ప్రభావం చూపిస్తాయి. పసిడి , వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. భారతీయులు బంగారం నగలను ఓ స్టేటస్ సింబల్ గా మాత్రమే కాదు ఎప్పుడైనా అనుకోని విధంగా ఆర్థిక ఇబ్బందులు కలిగే అప్పుడు బంగారం ఆదుకుంటుందని .. ఆర్థిక భరోసా ఇస్తుందని నమ్మకం. అందుకనే పండగలు, పెళ్ళిళ్ళు, శు భకార్యాలు ఇలా ఏ సందర్భం వచ్చినా .. ఇంకా చెప్పాలంటే ఎప్పుడు డబ్బులు ఉంటే అప్పుడు.. ఏడాది పొడవునా బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తినిమ చూపిస్తూ ఉంటారు. అదే సమయంలో ప్రస్తుతం బంగారం, వెండిపై పెట్టుబడులను పెట్టడానికి ముదుపర్లు ఆసక్తిని చూపిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం బంగారం ధర ఆల్ టైం హైకి చేరుకొని పసిడి ప్రియులకు షాక్ ఇచ్చింది. అయితే అంతర్జాతీయ మార్కట్ లో డాలర్ బలపడడంతో నేడు బంగారం ధర స్వల్పంగా తగ్గింది. హైదరాబాద్ లో గురువారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 88,040 ఉండగా.. 24 క్యారెట్ల (మేలిమి బంగారం) 10 గ్రాముల బంగారం ధర రూ.96,050 లుగా కొనసాగుతోంది. ఇవే ధరలు తెలుగురాష్ట్రాల్లో ప్రధాన నగరాలైన రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, పొద్దుటూరులలో కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88,040గా ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.96,200 లుగా ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88,040 వద్ద ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 96,050 వద్ద కొనసాగుతోంది. ఇవే ధరలు దేశంలో ప్రధాన నగరాలైన కేరళ, కోల్ కతా, పూణే, బెంగళూరు లో కూడా కొనసాగుతున్నాయి. బంగారంతో పాటు వెండి కూడా మంచి ఆదరణ ఉంది. ఎటువంటి సందర్భం వచ్చినా బహుమతులుగా వెండి వస్తువులు ఇవ్వడానికి ఆసక్తిని చూపిస్తారు. అయితే గతంలో కంటే ఇప్పుడు వెండితో రకరకాల ఆభరణాలను తయారు చేస్తున్నారు. ఇవి నేడు ట్రెండీగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కిలో వెండి ధర ఒకానొక సమయంలో లక్ష దాటింది కూడా.. ఈ నేపథ్యంలో నేటి వెండి ధర ఎలా ఉన్నదో తెలుసుకుందాం.. దేశ వ్యాప్తంగా పసిడి బాటలో నడుస్తూ వెండి ధర స్వల్పంగా దిగి వచ్చింది. ఈ నేపద్యంలో రోజు గురువారం కేజీ వెండి ధర రూ. 1,08,900లు ఉండగా.. ఇదే ధర కేరళ, చెన్నై లో కూడ ఉంది. అయితే దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 97,800 ఉంది. ఇదే ధర కోల్ కతా, బెంగుళూరు లో కొనసాగుతోంది.

## ఏజీఐ గ్రూప్‌తో స్టాండర్డ్ గ్లాస్ ఒప్పందం

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్).. జపాన్‌కు చెందిన ఏజీఐ గ్రూప్, దాని అనుబంధ సంస్థ జీఎల్ హక్కోతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ ఒప్పంద కాలపరిమితి 20 సంవత్సరాలని తెలిపింది. ఒప్పందంలో భాగంగా జీఎల్ హక్కోకు చెందిన గ్లాస్-లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్స్‌ను భారత్‌లో తయారు చేయటంతో పాటు మార్కెట్ చేయనున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ స్పెషలైజ్డ్ పరికరాలను పూర్తిగా దిగుమతి చేసుకుంటూ వస్తున్నామని, భారత్‌లో తొలిసారిగా స్టాండర్డ్ గ్లాస్ వీటి తయారీ, విక్రయాలను చేపడుతోందని సంస్థ ఎండీ నాగేశ్వర రావు తెలిపారు. ఏజీఐ, జీఎల్ హక్కోతో కుదుర్చుకున్న ఒప్పందం తమకే కాకుండా భారత ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు ఎంతో మేలు చేకూర్చనుందన్నారు. గ్లాస్-లైన్డ్ షెల్, హీట్ ఎక్స్ఛేంజర్స్‌కు అంతర్జాతీయంగా 200 కోట్ల డాలర్ల మార్కెట్ ఉండగా.. ఒక్క భారత్‌లోనే రూ.2,000 కోట్ల మార్కెట్ ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్‌లో ప్రతి నెల 200 యూనిట్ల సామర్థ్యంతో ఈ ఉత్పత్తుల తయారీని చేపట్టాలని చూస్తున్నట్లు నాగేశ్వర రావు తెలిపారు.




## ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ప్రకటన..

# విధ్వంసకర ఓపెనర్ రీ ఎంట్రీ

భారత మహిళల క్రికెట్ జట్టు ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో భాగంగా ఆతిథ్య ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌లకు భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. ఈ రెండు సిరీస్‌లలో భారత కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యహరించనున్నారు. అదేవిధంగా ఇంగ్లండ్ టూర్‌కు స్టార్ ప్లేయర్లు శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్ గాయాల కారణంగా దూరమయ్యారు. శ్రేయాంక చేతి వేలి గాయంతో బాధపడుతుండగా.. రేణుకా మోకాలి గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉంటుంది. దీంతో వీరిద్దరూ శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లోనూ భారత్ జట్టులో భాగం కాలేదు. మరోవైపు వన్డే జట్టు నుంచి కష్వీ గౌతమ్‌ను సెలక్టర్లు తప్పించారు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో గౌతమ్ ఆడే అవకాశం వచ్చినప్పటికి, పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఈ క్రమంలోనే ఆమెను సెలక్టర్లు పక్కన పెట్టారు.

**షెఫాలీ రీ ఎంట్రీ..**

ఇక భారత టీ20 జట్టులోకి స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ రీ ఎంట్రీ ఇచ్చింది. డబ్ల్యూపీఎల్-2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున షెఫాలీ అద్భుతంగా రాణించడంతో సెలక్టర్లు తిరిగి పిలుపు నిచ్చారు. ఈ ఏడాది డబ్ల్యూపీఎల్ సీజన్‌లో షెఫాలీ 152.76 స్ట్రైక్ రేటుతో 304 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా సైతం టీ20 జట్టులోకి పునరాగమనం చేసింది. అదేవిధంగా వైఎస్ఆర్ జిల్లాకు చెందిన శ్రీచరణి వన్డే, టీ20 జట్టులో చోటు దక్కించుకుంది. ఇటీవలే శ్రీలంక పర్యటనతో అరంగేట్రం చేసిన శ్రీచరణి.. తన అద్బుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇక భారత జట్టు ఇంగ్లండ్ పర్యటన జూన్ 28 నుంచి ప్రారంభం కానుంది.



భారత టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా , హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ రాణా, శ్రీ చరణి, శుచి రణ్‌ఉపాధ్యాయ, కె అరుణ్‌జో ఉపాధ్యాయ్, కె అరుణ్‌జో ఉపాధ్యాయ్ ఉపాధ్యాయ్ సత్ఘరే

భారత వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా , తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ రాణా, శ్రీ చరణి, కె అరుణ్ధా రెడ్డి, షుచి అమాన్‌ప్రీత్‌కౌర్ గౌడ్, సయాలీ సత్ఘరే

## టీమిండియాతో టెస్టు సిరీస్..

## ఇంగ్లండ్ క్రికెట్ మాస్టర్ ప్లాన్



టీమిండియాతో వచ్చే నెలలో ప్రారంభం కానున్న టెస్టు సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టు అన్ని విధాల సిద్దమవుతోంది. ఈ క్రమంలో  ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. తమ జట్టు 'స్పెషల్ స్కిల్స్ కన్సల్టంట్' న్యూజిలాండ్ పేస్ దిగ్గజం టిమ్ సౌథీని ఇంగ్లండ్ క్రికెట్ నియమించింది. టిమ్ సౌథీ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్లలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. తన అపార అనుభవంతో ఇంగ్లండ్ క్రికెట్‌ను ముందుకు నడిపిస్తాడు అని ఈసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా ఈ న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ జేమ్స్ ఆండర్సన్ స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. ఇప్పటివరకు  జేమ్స్ ఆండర్సన్ ఇంగ్లండ్ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా పనిచేశాడు. అయితే అతడు కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో లంకాషైర్ తరపున ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే సౌథీతో ఈసీబీ ఒప్పందం కుదుర్చుకుంది. ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జింబాబ్వేతో జరగనున్న ఏకైక టెస్టుతో సౌథీ తన కొత్త ప్రయాణాన్ని ఆరంభించనున్నాడు. ఇప్పటికే ఇంగ్లండ్ క్యాంపులో చేరిన సౌథీ.. దగ్గరుండి ఆటగాళ్ల ప్రాక్టీస్‌ను పర్యవేక్షిస్తున్నాడు. కాగా గత డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు విడ్కోలు పలికిన సౌథీ.. భారత్‌పై మెరుగైన రికార్డును కలిగి ఉన్నాడు. అదేవిధంగా ఇంగ్లండ్ గడ్డపై ఆడిన అనుభవం కూడా ఉంది. ఈ ??క్రమంలోనే బ్రెండన్ మెక్‌కల్లమ్‌తో కూడిన కోచింగ్ బృందంలో సౌథీని ఈసీబీ చేర్చింది. సౌథీ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. వన్డేల్లో 221 వికెట్లు పడగొట్టిన సౌథీ..టెస్టుల్లో 391, టీ20ల్లో 164 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక భారత్- ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ డబ్ల్యూటీసీ సైకిల్ 2025-27లో సైకిల్‌లో భాగంగా జరగనుంది. జూన్ 20 నుంచి టీమిండియా- ఇంగ్లండ్ మధ్య ఈ ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది.

స్పోర్ట్స్

## శుబ్‌మన్ గిల్, పంత్ కాదు..

## అతడి టెస్టు కెప్టెన్ చేయండి: అశ్విన్



ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో భారత తదుపరి టెస్టు కెప్టెన్ ఎవరన్న చర్చ మొదలైంది. టెస్టు కెప్టెన్సీ రేసులో యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ముందుంజలో ఉన్నాడు. కెప్టెన్‌గా గిల్ ఎంపిక దాదాపు ఖాయమైందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే టీమిండియా తదుపరి కెప్టెన్ గిల్ అన్న ఊహాగానాలపై భిన్నభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది మాజీలు సంతృప్తి వ్యక్తం చేస్తూంటే.. మరి కొంత మంది సీనియర్ ఆటగాడిని కెప్టెన్‌గా చేయాలని బీసీసీఐని సూచిస్తున్నారు. ఈ క్రమంలో టీమిండియా స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను భారత కెప్టెన్‌గా ఎంపిక చేయాలని అశ్విన్ సూచించాడు.."ప్రస్తుత భారత జట్టులో రవీంద్ర జడేజా అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు. అతడిని కూడా కెప్టెన్సీ ఎంపికగా పరిగణించాలి. మీరు కొత్త ఆటగాడికి శిక్షణ ఇచ్చి తర్వాత కెప్టెన్‌గా చేయాలని భావిస్తుంటే..  సారథిగా మీకు జడేజా బెస్ట్ ఛాయిస్. జడేజా రెండేళ్ల పాటు జట్టుకు నాయకత్వం వహించవచ్చు.  జడ్డూకు డిప్యూటీగా మీరు ఎవరినైతే కెప్టెన్‌గా చేయాలనకుంటున్నారో వారిని నియమించండి. అప్పుడు అతడు మరింత రాటుదేలుతాడు. భారత జట్టుకు కెప్టెన్ కావడం ప్రతి ఆటగాడి కల. జడేజాకు అవకాశమిస్తే అతడు కచ్చితంగా స్వీకరిస్తాడని" అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో పేర్కొన్నాడు. అదేవిధంగా శుబ్‌మన్ గిల్‌పై కూడా అశూ ప్రశంసల వర్షం? కురిపించాడు. ఐపీఎల్-2025లో గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తుందని నేను ఆశిస్తున్నాను. గిల్ అక్కడ జట్టును గెలిపిస్తే.. కెప్టెన్‌గా పరిపక్వత సాధించినట్లు అవుతోంది. అయితే టెస్టుల్లో కెప్టెన్సీ అంత సలువు కాదు. ఒక కెప్టెన్‌గా ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో కూడా ఏమి జరుగుతుందో తెలుసుకోవాలని అశ్విన్ అన్నాడు.



## బేబీ జోడీ రిపీట్.. క్లాప్ కొట్టిన రష్మిక!

బేబీ మూవీతో సూపర్ హిట్ కొట్టిన జోడీ ఆనంద్ దేవరకొండ- వైష్ణవి చైతన్య. వీరిద్దరి క్రేజీ కాంబో మరోసారి రిపీట్ కానుంది. ఆనంద్, వైష్ణవి మరోసారి లవ్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా కొత్త సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇవాళ హైదరాబాద్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమానికి నేషనల్ క్రష్ రష్మిక మందన్నా క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. దీనికి సంబంధించిన ఫోటోలను నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ కార్యక్రమంలో రష్మిక మందన్నా క్లాప్ కొట్టగా.. శివాజీ కెమెరా స్విచ్చాన్ చేయగా.. డైరెక్టర్స్ వెంకీ అట్లూరి. కళ్యాణ్ శంకర్ స్క్రిప్ట్ అందించారు. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ లవ్ స్టోరీకి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు.



## ‘ధర్మం దారి తప్పినప్పుడు.. వచ్చినవాడు గౌతమ్’.. ఆసక్తిగా టీజర్

అశ్విన్ బాబు లీడ్ రోల్ నటిస్తోన్న తాజా చిత్రం ‘వచ్చినవాడు గౌతమ్’. ఈ చిత్రంలో రియా సుమన్, అయేషాఖాన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీకి మామిడాల ఎం ఆర్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను అరుణ శ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే మిస్టరీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ‘ధర్మం దారితప్పినప్పుడు.. ఏ అవతారం రానప్పుడు.. వచ్చినవాడు గౌతమ్’ అనే డైలాగ్ ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఈ చిత్రంలో అజయ్, సచిన్ ఖేడేకర్, మురళీ శర్మ, సాయి రోనక్, అభినయ, నెల్లూరు సుదర్శన్, వైవా రాఘవ, విద్యులేఖ, షకలకశంకర్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు గౌర హరి సంగీతమందిస్తున్నారు.

## హాట్ సమ్మర్‌లో ఎద అందాలతో చెమటలు పట్టిస్తున్న నేహా శెట్టి



## వన్స్ ఐ స్టెప్ ఇన్.. బాలకృష్ణ మ్యాన్షన్ హౌజ్ యాడ్ అదిరిపోలా..!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి నటసింహం బాలయ్య ఎంత స్ట్రెట్ ఫార్వార్డ్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఏ విషయాన్ని అయిన కూడా చాలా ఓపెన్‌గా మాట్లాడతారు. బాలయ్య జీవితం తెరచిన పుస్తకం అని చెప్పవచ్చు. ఆయన తాగే డ్రింక్ కూడా అందరికి తెలుసు. అదే మ్యాన్షన్ హౌజ్. అమెరికా వెళ్లినా సరే తన వెంట మ్యాన్షన్ హౌస్ తీసుకుని వెళతారని చిన్న అల్లుడు భరత్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం చూశాం. కొన్ని సినిమాల్లో మ్యాన్షన్ హౌస్ , బాలకృష్ణ మీద డైలాగులు వినిపించాయి కాని బాలయ్య తన నోటి వెంట చెప్పింది లేదు. తాజాగా ‘వెల్ కమింగ్ సూన్ టు యువర్ ఫేవరెట్ హౌస్’ అంటూ మ్యాన్షన్ హౌస్ ఒక యాడ్ చేయగా, ఆ వీడియోలో ‘వన్స్ ఐ స్టెప్ ఇన్%ా%’ (హిస్టరీ రిపీట్స్) అంటూ బాలకృష్ణ డైలాగ్ చెప్పారు. అయితే%ా% బాలకృష్ణ చేసింది మ్యాన్షన్ హౌస్ డ్రింకింగ్ వాటర్ కోసం. బాలయ్య ఆహా తెలుగు ఓటీటీ కోసం ‘అన్‌స్టాపబుల్’ టాక్ షోకి హోస్ట్‌గా ఉండగా, ఆ షోకి మ్యాన్షన్ హౌస్ అడ్వర్టైజింగ్ పార్ట్నర్. దాంతో బాలయ్య నోటి వెంట మ్యాన్షన్ హౌస్ అనే పదాన్ని కొన్ని సార్లు విన్నాం. ఇప్పుడు డైరెక్టుగా ఆ సంస్థకు ఆయన ప్రచారం చేస్తూ ఒక వాణిజ్య ప్రకటన చేయడం విశేషం. వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న బాలయ్య ప్రస్తుతం బోయపాటి శీను దర్శకత్వంలో అఖండ2 చిత్రం చేస్తున్నారు. ఈ మూవీ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా జూన్ 10న ఆ సినిమా గ్లింప్స్ లేదా టీజర్ విడుదల అయ్యే అవకాశం ఉంది. దాని కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ తర్వాత ‘వీరసింహా రెడ్డి’ వంటి హిట్ తీసిన గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు బాలయ్య. రజనీకాంత్ ‘జైలర్ 2’లో అతిథి పాత్రలో మెరవనున్నట్టు తెలుస్తుంది.. తమిళ దర్శకుడు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో సినిమా చేసేందుకు చర్చలు జరుపుతున్నట్టు వినికిడి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com